# విశాల భారతి

11-06-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

గురువారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 157




## మీనాక్షికి అన్యాయం

- విలువల నేత నిరాడంబరత నిజాయితీకి కేరాఫ్ అడ్రస్
- చిన్న లీగల్ నోటీసుతో నామినేషన్ రద్దు చేయడం వెనుక కుట్ర
- చట్టాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయ వేధింపులకు పాల్పడటం
- సాధారణ జీవనం పుస్తకాలే ఆస్తిగా అత్యంత సాధారణ జీవితం
- సమర్థులైన నేతలను బరి నుంచి తప్పించడం ప్రమాదకరం
- పార్టీకి తీరని లోటు కాంగ్రెస్ శ్రేణుల్లో తీవ్ర ఆవేదన నిరసన

03

## 'బతుకమ్మ కుంట కేసీఆర్ తాతదా'



- 2034 నాటికి వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- యువతకు 10 లక్షల ఉపాధి అవకాశాలు కల్పించడం
- చెరువుల ఆక్రమణదారులపై కఠిన చర్యలు తప్పవు
- అభివృద్ధిని అడ్డుకుంటే ప్రతిపక్షాలకు రాజకీయ మనుగడ ఉండదు
- అంతర్జాతీయ నగరాలతో పోటీపడేలా ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- అభివృద్ధిని అడ్డుకునే శక్తులను ఉపేక్షించే ప్రసక్తే లేదు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

గత ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ నగరంలోని చెరువులు పెద్ద ఎత్తున కబ్జాకు గురయ్యాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. అంబర్‌పేట ప్రాంతంలో ఉన్న బతుకమ్మ కుంటను బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఎడ్ల సుధాకర్ రెడ్డి ఆక్రమించుకున్నారని ఆయన ఆరోపించారు. కేసీఆర్ బొమ్మను హెలికాప్టర్‌తో ప్రదర్శించి కుంటను తన సొంత ఆస్తిగా మార్చుకోవడంపై రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములు ఎవరి సొత్తు కావని, సామాన్యుల ప్రయోజనాల కోసం ఉండాల్సిన ఆస్తులను రాజకీయ నాయకులు ఎలా కబ్జా చేస్తారని ప్రశ్నించారు. చట్ట వ్యతిరేక

మిగతా 2లో..



## రైతుల పొట్ట కొట్టొద్దు..!

- భూసేకరణతో రైతుల నిరంతర ఆందోళన
- కనీస వసతులు తొలగించి భయపెడుతున్న వైనం
- పరిహారం, ప్లాట్ల హామీల అమలులో వైఫల్యం
- కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తున్న అధికారులు
- పార్టీలు మారినా తీరని అన్నదాత కష్టాలు
- భూమి హక్కుల కోసం కొనసాగుతున్న పోరాటం

హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలో సుదీర్ఘకాలంగా నెలకొన్న భూసేకరణ వివాదం స్థానిక రైతుల జీవితాల్లో తీవ్ర విషాదాన్ని నింపుతోంది. కుర్మిద్ద, నానక్ నగర్, తాటిపర్తి, మేడిపల్లి గ్రామాల్లోని అన్నదాతలు తమ కన్నతల్లి వంటి సారవంతమైన భూములను ఫార్మా సిటీ ప్రాజెక్టు పేరుతో కోల్పోయే పరిస్థితి తలెత్తడంతో తీవ్ర ఆందోళనలో మునిగిపోయారు. 2016 సంవత్సరం నుండి ఈ ప్రాంతంలో మొదలైన భూ వివాదాలు రోజురోజుకూ జటిలమవుతూ, ప్రభుత్వ చర్యల పట్ల రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ ఉపాధిని దెబ్బతీసే రీతిలో సాగును అడ్డుకోవడం, విద్యుత్ కనెక్షన్లు తొలగించడం, నిరంతరం పోలీసు బలగాలను మొహరించడం వంటి చర్యలు ఈ గ్రామాల ప్రజలను శరణార్థులుగా మారుస్తున్నాయని వారు కన్నీరుమున్నీరవుతున్నారు. అధికారుల ఏకపక్ష నిర్ణయాలు అన్నదాతల కళ్లలో నీళ్లు తెప్పిస్తున్నాయి.



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తమ జీవనాధారమైన వ్యవసాయ భూములను వదులుకోవడానికి సిద్ధంగా లేని రైతులు, దశాబ్ద కాలంగా న్యాయ పోరాటం చేస్తూనే క్షేత్రస్థాయిలో నిరసనలు కొనసాగిస్తున్నారు. నిరంతర పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేయడం ద్వారా రైతులను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పశువుల మేత, తాగునీరు వంటి కనీస అవసరాలు కూడా తీరని దుస్థితిలో రైతులు తమ

మిగతా 3లో..

## మోదీ @12 ఏళ్లు

- అత్యధిక కాలం నిరంతరాయంగా పనిచేసిన భారత ప్రధానిగా రికార్డు
- 4,398 రోజుల నెహ్రూ రికార్డును మోదీ అధిగమించారు
- వరుసగా మూడు సార్వత్రిక ఎన్నికల్లో విజయం
- ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ
- 25 కోట్ల మందిని పేదరికం నుండి విముక్తం చేయడంపై ప్రశంసలు
- మౌలిక వసతులు, డిజిటల్ రంగంలో దేశాన్ని అగ్రపథంలో నిలపడం



**విశాలభారతి, జాతీయం:**

దేశ చరిత్ర గతిని మార్చేసే నిర్ణయాలతో, అభివృద్ధి పథంలో దేశాన్ని పరుగులు పెట్టిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరికొత్త రికార్డును నెలకొల్పారు. బుధవారం నాటికి ఆయన 4,399 రోజుల పాటు అత్యున్నత పదవిలో కొనసాగుతూ, భారత ప్రజాస్వామ్య చరిత్రలో అత్యధిక కాలం నిరంతరాయంగా పనిచేసిన ఎన్నికైన ప్రధానమంత్రిగా రికార్డు సృష్టించారు. జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న సుదీర్ఘకాల రికార్డును అధిగమించి, ఆధునిక భారత నిర్మాణంలో తనదైన ముద్ర వేశారు. 2014 మే 26న మొదటిసారిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు, ఆయన చేపట్టిన ప్రతి సంస్కరణ వెనుక 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలు ప్రతిబింబిస్తున్నాయి. ఈ ఘనత సాధించడం ద్వారా ఆయన ఆధునిక భారతదేశం గర్వించదగ్గ నాయకుడిగా నిలిచారు. జవహర్‌లాల్ నెహ్రూ 1952లో

మిగతా 3లో..

## 2047 వరకు మోదీయే ప్రధాని

- అత్యధిక కాలం ప్రధానిగా నెహ్రూ రికార్డును మోదీ అధిగమించారు
- సుదీర్ఘకాలం సేవలందించిన ప్రధానిగా మోదీ చరిత్ర సృష్టించారు
- 2047 వరకు మోదీనే ప్రధానిగా కొనసాగాలని బండి సంజయ్ కోరారు
- విప్లవాత్మక నిర్ణయాలతో భారత్ 'విశ్వగురు'గా ఎదుగుతోంది
- ప్రపంచ వేదికలపై భారత్ ప్రతిష్ఠ శరవేగంగా పెరుగుతోంది

03





## వరి వేస్తే ఉరేనా?

- రాబోయే 5 ఏళ్లు, ఏటా 5 లక్షల ఎకరాల చొప్పున వరి సాగు తగ్గించాలి
- తెలంగాణ, యూపీ, పశ్చిమ బెంగాల్‌కు కేంద్రం/నీతి ఆయోగ్ ఆదేశాలు
- ప్రభుత్వంపై ఆర్థిక భారం తగ్గించి, ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడం
- వరి కోసం భారీగా నీరు, విద్యుత్ వినియోగం, కొనుగోళ్ల భారం
- కేంద్రం ఆదేశాలను రైతుల వద్ద దాచిపెడుతున్న రాష్ట్ర ప్రభుత్వం
- పంట మార్పిడిపై స్పష్టత లేక రైతుల అయోమయం, పెరిగిన వ్యతిరేకత

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

వరి సాగు తగ్గింపుపై కేంద్రం, నీతి ఆయోగ్ జారీ చేసిన తాజా ఆదేశాలు రాష్ట్ర రైతాంగంలో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. వరి వేస్తే ఉరేననే ఆవేదన సర్వత్రా వ్యక్తమవుతోంది. రానున్న ఐదు సంవత్సరాల కాలంలో ప్రతి ఏడాది ఐదు లక్షల ఎకరాల చొప్పున వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించాలని తెలంగాణ సహా ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు కేంద్రం స్పష్టమైన హుకుం జారీ చేసింది. ఈ నిర్ణయం అమలులో భాగంగా ప్రతి ఏడాది ఐదు లక్షల ఎకరాల్లో వరి సాగును పూర్తిగా నిలిపివేసి ఆ స్థానంలో లాభసాటి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలనేది కేంద్రం ఉద్దేశ్యం. అయితే ఈ కీలక ఆదేశాలను ప్రజలకు స్పష్టం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ ఇప్పటివరకు బహిర్గతం చేయకుండా కేవలం పంట మార్పిడి పేరుతో సన్నాయి నొక్కులు నొక్కుతూ రైతులను మరింత అయోమయంలోకి నెట్టివేస్తోంది. దేశంలో వరి సాగు గణాంకాలను పరిశీలిస్తే పరిస్థితి తీవ్రత అర్థమవుతుంది. గత వానకాలం సీజన్‌లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం 167.75 లక్షల ఎకరాల్లో, పశ్చిమ బెంగాల్ 105.66 లక్షల ఎకరాల్లో, తెలంగాణ 69.90 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశాయి. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 42.67 లక్షల ఎకరాల్లో సాగు జరగగా, తమిళనాడులో 18.53 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి వేశారు. యాసంగి సీజన్‌లో ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు చాలా తక్కువ విస్తీర్ణంలో వరిని సాగు చేసినప్పటికీ తెలంగాణలో మాత్రం గణనీయంగా 59.90 లక్షల

మిగతా 2లో..

## 2027 చివరికి మేడిగడ్డ పునరుద్ధరణ

- 2027 వేసవి చివరికి పనులు పూర్తి
- నవంబర్/డిసెంబర్ నుంచి పనుల ప్రారంభం
- ఐఐటీ ముంబై ద్వారా సాంకేతిక అధ్యయనం
- సీడబ్ల్యూసీ, ఎన్‌డీఎస్‌ఏ ఆమోదం తర్వాతే పనులు
- గత ప్రభుత్వ తప్పిదాల వల్లే బ్యారేజీకి నష్టం
- లోతైన పరీక్షలతో భవిష్యత్తులో నష్టం జరగకుండా చర్యలు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. పనులు వేగవంతం చేసే దిశగా నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

మిగతా 2లో..



## పల్లె కథల పెద్దాయన ఇక లేరు

- సినీ దిగ్గజం భారతీరాజా (86) ఇక లేరు
- పల్లెటూరి కథలను వెండితెరపై ఆవిష్కరించిన దర్శకుడు
- 'సీతాకోకచిలుక' వంటి అద్భుత చిత్రాల సృష్టికర్త
- అగ్ర దర్శకుడిగా, నటుడిగా సుదీర్ఘ ప్రస్థానం.
- కుమారుని మరణంతో తీవ్ర మనస్తాపానికి గురైన తండ్రి
- భారతీయ సినీ చరిత్రలో నిలిచిపోయే గొప్ప కళాకారుడు

06



## శ్రీరాంసాగర్ డెడ్ స్టోరేజ్

- 80 టీఎంసీలకు గాను కేవలం 16 టీఎంసీల నీరే ఉంది
- సాగుకు మిగిలింది కేవలం 6 టీఎంసీలు మాత్రమే
- పూడిక తీత లేక తగ్గిన ప్రాజెక్టు సామర్థ్యం
- నీరు లేక బీడువారుతున్న 18 లక్షల ఎకరాల ఆయకట్టు
- వర్షా భావం, వాతావరణ మార్పులతో మరింత ముప్పు
- వెంటనే పూడిక తీసి, కాలువల మరమ్మతులు చేపట్టాలి

02

## కొండాపూర్ శ్రీరామ్‌నగర్‌లో బాబురావు అక్రమ నిర్మాణాల సామ్రాజ్యం

- సెట్‌బ్యాక్‌లు గాలికి అదనపు అంతస్తుల పైపైకి
- ప్రభుత్వ ఖజానాకు రూ. కోట్ల గండి
- అధికారుల మౌనం విశాలభారతి వరుస కథనాలతో బట్టబయలు

06



# 'బతుకమ్మ కుంట కేసీఆర్ తాతదా'




**మొదటిపేజీ తరువాయి**

పనులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజా ఆస్తులను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రధాన బాధ్యతని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్ శివారులో భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థ భవనాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యూచర్ సిటీ తన డ్రీమ్ ప్రాజెక్ట్ అని, ఇది రాబోయే తరాలకు బంగారు బాటగా మారుతుందని ప్రకటించారు. హైదరాబాద్‌కు సుమారు నాలుగు వందల ఏళ్ల చరిత్ర ఉండగా, సికింద్రాబాద్ జంట నగరంగా రెండు వందల ఏళ్ల వైభవాన్ని కలిగి ఉందని గుర్తు చేశారు. చారిత్రక వారసత్వాన్ని కాపాడుకుంటూనే నగరాన్ని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు. రాష్ట్ర ఆదాయంలో అరవై శాతం వాటాను అందిస్తున్న సైబరాబాద్ సాంకేతిక విప్లవం గురించి రేవంత్ ప్రస్తావించారు. రంగారెడ్డి జిల్లాలోని భూముల విలువ ప్రస్తుతం ఎకరాకు రెండు వందల కోట్ల రూపాయల కంటే ఎక్కువగా ఉందని ఆయన పేర్కొన్నారు. బంగారం కంటే విలువైన భూమిని తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం వినియోగించాలని స్పష్టం చేశారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతం ఆయుధాల నిల్వ కేంద్రంగా మారి శత్రు దుర్భేధ్యంగా నిలవడంలో గత పాలకులు చూపిన దార్శనికత అభినందనీయమని కొనియాడారు. స్వతంత్ర భారతంలో అప్పటి ముఖ్యమంత్రులు తీసుకున్న నిర్ణయాలే నేటి తెలంగాణ ప్రగతికి పునాదులని చెప్పారు. గతంలో హైటెక్ సిటీ, అవుటర్ రింగ్ రోడ్డు, ఐటీ పార్కుల ఏర్పాటును అడ్డుకున్న శక్తులు ఇప్పటికీ ఉన్నాయని ముఖ్యమంత్రి మండిపడ్డారు. గూగుల్, ఇన్ఫోసిస్ వంటి అంతర్జాతీయ సంస్థలు నగరానికి రాకుండా అప్పట్లో కొందరు అడ్డంకులు సృష్టించారని గుర్తు చేశారు. ఒకవేళ ఆనాడు ఆ నిర్మాణాలు జరగకుండా ఉంటే, నేడు లక్షలాది మంది తెలంగాణ యువత ప్రపంచ దేశాల్లో ఐటీ నిపుణులుగా ఎలా రాణించేవారని ఆయన ప్రశ్నించారు. అభివృద్ధిని అడ్డుకున్న వారి కడుపులో మూసీ నది కంటే ఎక్కువ విషం ఉందని, అలాంటి వ్యక్తులు నగరం బాగుపడటం చూసి ఓర్వలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని అమెరికా వంటి దేశాల్లో మాట్లాడుతున్న ప్రతిపక్ష నేతలకు ఆయన హెచ్చరికలు జారీ చేశారు. అటువంటి రాక్షస ఆలోచనలు చేసే వారికి భవిష్యత్తులో రాజకీయ మనుగడ ఉండదని, ప్రజలు వారిని బండకేసి కొడతారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఫ్యూచర్ సిటీ అనేది ఒక వ్యక్తిగత ప్రాజెక్టు కాదని, ఇది తెలంగాణ భవిష్యత్తు తరాల జీవనాడి అని ఆయన అభివర్ణించారు. అభివృద్ధిని అడ్డుకుంటే రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా దక్కదని రేవంత్ స్పష్టం చేశారు. బాధ్యత గల పదవుల్లో ఉన్నవారు రాష్ట్ర పురోగతిని కాంక్షించాలి తప్ప కుట్రలు చేయడం తగదని సూచించారు. రానున్న ఎనిమిదేళ్లలో ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. రెండు వేల ముప్పై నాలుగు నాటికి ఈ నగరం వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు వేదిక కావాలన్నదే తమ ఆకాంక్ష అని చెప్పారు. అగ్రరాజ్యాలలోని టోక్యో, న్యూయార్క్, సింగపూర్ వంటి మహానగరాలతో పోటీ పడేలా ఈ సిటీ రూపుదిద్దుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రభుత్వం చేపట్టిన ఈ బృహత్ ప్రయత్నాన్ని అడ్డుకునే ఏ శక్తినీ ఉపేక్షించేది లేదని ఆయన పునరుద్ఘాటించారు. పారదర్శకమైన పాలనతో పది లక్షల మంది యువతకు ఉపాధి కల్పించడమే తమ ధ్యేయమని వివరించారు. గతంలో భూముల ధరలు పెంచి సామాన్యలను ఇబ్బందులకు గురిచేసిన వారు, ఇప్పుడు నగర అభివృద్ధిని అడ్డుకోవడం విడ్డూరంగా ఉందని ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు. హైదరాబాద్ అంటే కేవలం ఒక నగరం కాదు, అది తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక అని చెప్పారు. ప్రజా క్షేత్రంలో ఓటమిని చవిచూసిన వారు ఇలాంటి ఆరోపణలతో కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి సాహసోపేత నిర్ణయం వెనుక కోట్ల మంది ప్రజల భవిష్యత్తు దాగి ఉందని గుర్తుంచుకోవాలని సూచించారు. అభివృద్ధి విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరం పర్యాటక రంగంలో, పారిశ్రామికీకరణలో ఇప్పటికే ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోందని రేవంత్ చెప్పారు. ఫ్యూచర్ సిటీతో ఈ స్థాయి మరింత పెరుగుతుందని, అంతర్జాతీయ సంస్థలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు క్యూ కడతాయని ధీమా వ్యక్తం చేశారు. ప్రాజెక్టుకు అవసరమైన అన్ని మౌలిక వసతులను అత్యున్నత ప్రమాణాలతో కల్పిస్తామని హామీ ఇచ్చారు. నీటి సరఫరా, విద్యుత్ సౌకర్యాలు, రవాణా వ్యవస్థలను పటిష్టం చేసేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. ఈ ప్రగతి ప్రయాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర పురోగతిని అడ్డుకునే ప్రతిపక్షాల తీరుపై ఆయన విస్మయం వ్యక్తం చేశారు. కబ్జా కోరుల కోరలు పీకే కార్యక్రమాన్ని ఇప్పటికే ప్రారంభించామని, ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని హెచ్చరించారు. ఆక్రమణలకు గురైన భూములను కాపాడటంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. చట్టబద్ధమైన పద్ధతుల్లోనే ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతుందని, ఇందులో ఎలాంటి అక్రమాలకు తావులేదని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని వెనక్కి నెట్టే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ తెలంగాణకు ఒక నూతన ఉత్తేజాన్ని ఇస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. అభివృద్ధి చెందిన తెలంగాణ, బంగారు తెలంగాణగా మారేందుకు ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిలా నిలుస్తుందని చెప్పారు. నాటి పాలకుల నిర్లక్ష్యం వల్ల జరిగిన నష్టాన్ని భర్తీ చేస్తూ, రాబోయే తరాలకు ఒక సురక్షితమైన ఉపాధి మార్గాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. అధికారం ఉన్నా లేకపోయినా తెలంగాణ అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందని స్పష్టం చేశారు. అడ్డుపడే వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని, తమ ప్రయాణం ఆగేది లేదని తేల్చి చెప్పారు.

## జ్ఞానం తప్పుదోవ పట్టేనా 'అ'జ్ఞానకుమారా..

### ఫోర్జరీ సంతకాలతో కోట్లు మింగేసిన మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్



**మంచిర్యాల, విశాలభారతి:** చెన్నూరు మండలం సోమనపల్లి గ్రామంలో ప్రజలకు తాగునీళ్లు అందించాలని లక్ష్యంగా ప్రారంభించిన 'సోమనపల్లి మంచినీటి పథకం'లో 9 కోట్ల రూపాయల అంచనాలతో 2013లో మంజూరు అయిన ఈ పథకంలో ప్రస్తుత మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ జ్ఞానకుమార్ భారీగా అక్రమాలు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జ్ఞానకుమార్ తన క్రింది స్థాయి అధికారులను భయపెడుతూ, తాను చేయబోయే అవినీతికి సహకరించాలని ఒత్తిడికి గురిచేసి, గతంలో పదవీ విరమణ పొందిన క్వాలిటీ కంట్రోల్ అధికారి సంతకం ఫోర్జరీ చేసి 2 కోట్ల రూపాయలు కాజేసినట్లు తెలుస్తోంది. గ్రామంలోని ప్రజలు పథకం ప్రారంభమైనప్పటికీ ఇంతకాలం గడుస్తున్నా చుక్క నీరు కూడా అందకపోవటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయగా ప్రభుత్వ నిధులు మంజూరు చేయబడినప్పటికీ ప్రాజెక్టు పూర్తి చేయకపోవడం, సరిగా పనులు చూపించకపోవడం వంటి అంశాలు ప్రజల్లో నిరాశ మొదలయింది దీంతో సాక్ష్యాలతో వెలికి తీసే అవసరం ఉంది అనే వైఖరి వ్యక్తం చేస్తూ గత పన్నెండు సంవత్సరాలుగా అవినీతి వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతున్న సోమనపల్లికి చెందిన ఓ రిటైర్డు ఉపాధ్యాయుడు సేకరించిన సమాచారం ద్వారా ఇతగాడి బాగోతం బట్టబయలు అయ్యింది.అంతే కాకుండా ఇతగాడిపై గత 8 సంవత్సరాలుగా సూపరింటెంటింగ్ ఇంజనీరుగా, చీఫ్ ఇంజనీర్ గా పని చేస్తూ అనేక అక్రమాలు చేశాడని ఆరోపణలు ఉన్నాయి. సాధారణ జీతం స్థాయికి సంబంధం లేని విలాస జీవితం నడిపించుతున్నాడనీ, అక్రమంగా సంపాదించిన కోట్ల డబ్బును వ్యక్తిగత ఖర్చులకు వాడుకుంటూ విలాస జీవనం గడుపుతున్నాడని ఎన్నో రోజులుగా మోజు పడ్డ ఈఎన్ సి పదవి కోసం 30కోట్లు ఖర్చు పెట్టి అయినా తెచ్చుకుంటానని చెప్పుకుంటున్నాడని తన ఆఫీసులో మాటలు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు చుక్క నీరు కూడా అందజేయనటువంటి ఈ పథకం కింద కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ముఖ్య మంత్రిని, ఉన్నతాధికారులను కలిసి ఈ పథకంపై ప్రత్యేక విచారణ బృందం సిట్ లేదా సీఐడీ ద్వారా సమగ్ర విచారణ చేపట్టి అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రిటైర్డు ఉపాధ్యాయుడు కోరినట్టు సమాచారం..ఇట్టి విషయంపై ప్రభుత్వం మరియు ఉన్నత అధికారులు విచారణ జరిపి ఎంతవరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందో వేచి చూడాలి మరి.



# శ్రీరాంసాగర్ డెడ్ స్టోరేజ్

**మొదటిపేజీ తరువాయి**

అడుగంటిపోవడం ఆ ప్రాంత రైతాంగంలో తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం ఒక వేయి తొంభై ఒకటి అడుగులు కాగా, మొత్తం నిల్వ సామర్థ్యం ఎనభై టీఎంసీల ఐదు వందల మిలియన్ ఘనపుటడుగులుగా నిర్దేశించారు. అయితే ప్రస్తుత పరిస్థితులను గమనిస్తే జలాశయంలో కేవలం పదహారు టీఎంసీల నీరు మాత్రమే మిగిలి ఉండటం ఆందోళన కలిగించే అంశం. లభ్యమవుతున్న ఈ నీటిలో ఐదు టీఎంసీల నీటిని డెడ్ స్టోరేజీగా పరిగణించాల్సి ఉంటుంది. అదేవిధంగా మరో ఐదు టీఎంసీలను కేవలం తాగునీటి అవసరాల కోసం కేటాయించాల్సిన దుస్థితి నెలకొంది. దీనివల్ల సాగునీటికి అందుబాటులో ఉన్న నీటి నిల్వ ఆరు టీఎంసీలకే పరిమితమైంది. ఈ పరిస్థితి రాబోయే రోజుల్లో వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో సుమారు పద్దెనిమిది లక్షల ఎకరాల భూమి సాగులో ఉంది. ఇన్ని లక్షల ఎకరాలకు సాగునీరు అందించే కీలకమైన ప్రాజెక్టులో ఇంత తక్కువ స్థాయిలో నీరు ఉండటం రైతుల నిద్రను దూరం చేస్తోంది. గత సీజన్‌లో ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద జలాలు వచ్చినప్పటికీ, జలాశయంలో పేరుకుపోయిన పూడిక కారణంగా నీటిని పూర్తి స్థాయిలో నిల్వ చేయడం సాధ్యపడలేదు. ఫలితంగా ప్రాజెక్టు భద్రత దృష్ట్యా పెద్ద ఎత్తున నీటిని దిగువకు వదలాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడింది. గడిచిన సంవత్సరాల్లో పూడిక తీత పనులు చేపట్టకపోవడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి మట్టం పడిపోవడంతో మెండోరా, బాల్కొండ, ముప్కాల్ మండలాల పరిధిలోని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూగర్భ జలాలు గణనీయంగా క్షీణించడంతో వేలాది బోర్లు ఎండిపోయి అడుగంటిపోయాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు పడుతున్న పాట్లు వర్ణనాతీతం. సాగునీరు లేక పొలాలు బీడు పడుతుండటంతో పెట్టుబడులు వృథా అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జలాశయంలో పేరుకుపోయిన కోట్లాది టన్నుల పూడికను యుద్ధప్రాతిపదికన తొలగించి, ప్రాజెక్టు నిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో భవిష్యత్తులో తాగునీరు, సాగునీటి ఎద్దడి మరింత తీవ్రమై, నివాస



యోగ్యం కాని పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ప్రధానంగా మహారాష్ట్రలో కురిసే వర్షాల ద్వారానే వరద జలాలు చేరుతాయి. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు సమృద్ధిగా కురిస్తేనే జలాశయం నిండే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం రైతులను మరింత కంగారు పెడుతున్నాయి. రాబోయే కాలంలో వర్షపాతం తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని వాతావరణ శాఖ చేస్తున్న హెచ్చరికలు వ్యవసాయ రంగంపై నీలినీడలు కమ్ముకునేలా చేస్తున్నాయి. జూన్ నుంచి ఆగస్టు వరకు వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోతే సాగునీటి విడుదల ప్రక్రియలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని అధికారులు కూడా అంగీకరిస్తున్నారు. అటువంటి క్లిష్ట పరిస్థితి తలెత్తితే రైతాంగం కోలుకోలేని దెబ్బ తింటుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రాజెక్టు చరిత్రను ఒకసారి పరిశీలిస్తే, గతంలో చాలా సందర్భాల్లో ఆగస్టు చివరి వారం లేదా సెప్టెంబర్ నెలలో భారీ వరదలు సంభవించి జలాశయం నిండేది. ఆ సమయంలో వచ్చిన వరదలతో ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలేవారు. అయితే మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల వర్షపాతంలో మార్పులు సంభవిస్తున్నాయి. జూన్, జులై, ఆగస్టు నెలల్లో వర్షాభావ పరిస్థితులు కొనసాగితే ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. ఎగువన వర్షాలు లేని పక్షంలో ప్రాజెక్టుకు వచ్చే వరద నీటిపై ఆధారపడటం ప్రమాదకరంగా మారుతోంది. ప్రాజెక్టు నిల్వ సామర్థ్యంపైనే ఆధారపడి సాగు నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రాజెక్టు పరిధిలోని రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తూ రోజులను గడుపుతున్నారు. వర్షాకాలం సమీపిస్తున్నా ఆశించిన స్థాయిలో మేఘాలు కరుణించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఆయకట్టు భూములకు నీరు అందించే కాలువ వ్యవస్థ కూడా చాలా చోట్ల పూడికతో నిండిపోయి ఉంది. దీనివల్ల నీటి ప్రవాహ వేగం తగ్గి ఆఖరి ఆయకట్టుకు నీరు చేరడం కష్టంగా మారుతోంది. ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన కాలువల మరమ్మతులు చేపట్టి, పూడిక తొలగింపు పనులను వేగవంతం చేయాలి. ప్రాజెక్టు భవిష్యత్తుపై స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది. లేని యెడల పద్దెనిమిది లక్షల ఎకరాల ఆయకట్టుపై ఆధారపడిన లక్షలాది మంది రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయే ప్రమాదం ఉంది. నీటి నిర్వహణలో లోపాలు కూడా ప్రాజెక్టుపై ప్రభావం చూపుతున్నాయని పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సమర్థవంతమైన నీటి పారుదల ప్రణాళికలు లేకపోవడం, నీటి వృథాను అరికట్టలేకపోవడం వల్ల ఉన్న నీటిని కూడా సద్వినియోగం చేసుకోలేకపోతున్నాము. ఆయకట్టులో ఉన్న రైతులు తక్కువ నీటితో పండే పంటల వైపు మొగ్గు చూపేలా అవగాహన కల్పించాలి. నీటి పొదుపు పద్ధతులను అనుసరించడం ద్వారా ప్రస్తుత సంక్షోభాన్ని కొంతవరకు అధిగమించే అవకాశం ఉంటుంది. కానీ సాగునీటి లభ్యత విషయంలో మాత్రం ప్రభుత్వ జోక్యం తప్పనిసరి. ప్రాజెక్టులో ప్రతి అంగుళం నీటిని జాగ్రత్తగా వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రాజెక్టుకు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని నిధుల కేటాయింపులో కూడా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలి. కేవలం తాగునీటి సరఫరాకే ప్రాధాన్యత ఇస్తే సాగునీటి సమస్యలు అదుపుతప్పుతాయి. వందల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ప్రాజెక్టు నేడు నిల్వ సామర్థ్యాన్ని కోల్పోవడం సాంకేతిక లోపం మాత్రమే కాదు, నిర్వహణ వైఫల్యం కూడా దీనికి బాధ్యత వహించాల్సిన వారు ప్రాజెక్టు భద్రతను, పూడిక తీత పనులను పర్యవేక్షించాల్సి ఉంది. రైతుల ఆవేదనను అర్థం చేసుకుని, వచ్చే సీజన్ నాటికి ప్రాజెక్టులో నీటి నిల్వ పెరిగేలా చర్యలు చేపట్టాలి. లేని యెడల వ్యవసాయ రంగం కుదేలయ్యే ప్రమాదం ఉంది.

# 2027 చివరికి మేడిగడ్డ పునరుద్ధరణ

**మొదటిపేజీ తరువాయి**

బుధవారం మేడిగడ్డలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ప్రాజెక్టు వద్ద జరుగుతున్న సాంకేతిక పరిశోధనలను, ఇతర పరీక్షల తీరును స్వయంగా పర్యవేక్షించిన మంత్రి, పునరుద్ధరణ ప్రక్రియపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. వచ్చే ఏడాది అంటే రెండు వేల ఇరవై ఏడు వేసవి కాలం ముగిసేలోగా బ్యారేజీని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాల వల్ల ప్రాజెక్టుకు వాటిల్లిన నష్టాన్ని అధిగమించి, సురక్షితంగా పునరుద్ధరించేందుకు నిపుణుల సలహాలతో ముందుకు వెళ్తున్నామని వివరించారు. సాంకేతిక, హైడ్రాలజికల్ అధ్యయనాలను జులై మొదటి వారాని కల్లా పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని మంత్రి పేర్కొన్నారు. ప్రాజెక్టు పునరుద్ధరణ డిజైన్ల తయారీ ప్రక్రియ సెప్టెంబర్ నాటికి కొలిక్కి వస్తుందని, నవంబర్ లేదా డిసెంబర్ తొలి వారంలో క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న జియో టెక్నికల్ బోర్ హోల్ పరిశోధనలు, ఇతర పరీక్షలు తుది దశకు చేరుకున్నాయని, జూన్ చివరి నాటికి వీటన్నింటిని పూర్తి చేస్తామని చెప్పారు. పరిశోధనల అనంతరం రూపొందించే సమగ్ర నివేదికను కేంద్ర జలసంఘంతో పాటు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీకు పంపుతామని, వారి అనుమతులు వచ్చిన వెంటనే నిర్మాణ దశలోకి అడుగు పెడతామని వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనా లోపాలే మేడిగడ్డ బ్యారేజీ ప్రస్తుత దుస్థితికి కారణమని మంత్రి ఆరోపించారు. ప్రాజెక్టుల భద్రతను విస్మరించి, తొందరపాటుతో చేపట్టిన రీడిజైన్ల వల్ల ప్రజాధనం వృథా అయిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిందని గుర్తుచేశారు. అప్పట్లో ముప్పై ఎనిమిది వేల కోట్ల రూపాయలతో మొదలుపెట్టిన ఆ ప్రాజెక్టులో, రెండు వేల పద్నాలుగు నాటికి మూడవ వంతు పనులు పూర్తి చేశామని వివరించారు. ఆ ప్రణాళికను అలాగే కొనసాగించి ఉంటే రెండు వేల పదహారు, పదిహేడు నాటికే పదహారు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందేదని చెప్పారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల పేర్లు మార్చి, అంచనాలు భారీగా పెంచడం వెనుక ఆంతర్యమేమిటని మంత్రి ప్రశ్నించారు. ముప్పై ఎనిమిది వేల కోట్లతో మొదలైన ప్రాజెక్టు వ్యయం లక్ష కోట్ల రూపాయలు దాటడం విచారకరమని, కాగ్ అంచనాల ప్రకారం అది ఏకంగా కోటి నలభై ఐదు లక్షల రూపాయలకు చేరుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంతటి భారీ వ్యయంతో నిర్మించినప్పటికీ, రెండు వేల ఇరవై మూడు డిసెంబర్ ఏడవ



తేదీ తర్వాత మూడు బ్యారేజీలు నిరుపయోగంగా మారడం దురదృష్టకరమని అభిప్రాయపడ్డారు. రైతాంగ ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే గత పాలకులు ప్రాధాన్యం ఇచ్చారని, ఆ దుష్పరిణామాలను ఇప్పుడు తాము సరిదిద్దాల్సి వస్తోందని పేర్కొన్నారు. బ్యారేజీల డ్యామేజీలపై నియమించిన న్యాయ కమిషన్, ఎన్‌డీఎస్ఏ బృందాలు ప్రాథమికంగా నిర్మాణ లోపాలను నిర్ధారించాయని మంత్రి వెల్లడించారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడటమే ఏకైక లక్ష్యంగా పునరుద్ధరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా చేపడుతున్నామన్నారు. దీనికోసం ప్రపంచ ప్రఖ్యాత కన్సల్టెంట్ సంస్థ ఏఎఫ్ఆర్యై, ఐఐటీ ముంబై నిపుణులను సంప్రదిస్తున్నామని, వారి సాంకేతిక సలహాలు తీసుకుంటున్నామని తెలిపారు. పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ రీసెర్చ్ స్టేషన్ వారి నమూనాలను కూడా పరిశీలిస్తున్నామని, జాతీయ, అంతర్జాతీయ నిపుణుల సమక్షంలోనే ప్రతి అడుగు వేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రస్తుతం బ్యారేజీలలో జరుగుతున్న పరీక్షల పురోగతిపై మంత్రి కీలక వివరాలు అందించారు. మూడు బ్యారేజీలలో జీపీఆర్ పరీక్షలు ఇప్పటికే తొంభై శాతం వరకు పూర్తయ్యాయని, బోర్ హోల్, జియో టెక్నికల్ పరిశోధనలు ఎనభై శాతం పూర్తి కావచ్చాయని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి డ్యామేజీలు పునరావృతం కాకుండా ఉండటానికి, పునాదుల బలాన్ని పరీక్షించేందుకు నలభై నుంచి ఎనభై మీటర్ల లోతు వరకు బోర్ హోల్స్ తవ్వుతున్నామని చెప్పారు. అత్యంత శాస్త్రీయ పద్ధతిలో జరుగుతున్న ఈ పరీక్షల నివేదిక ఆధారంగానే, తదుపరి పునరుద్ధరణ వ్యూహాలను ఖరారు చేస్తామని, కేంద్ర సంస్థల ఆమోదం పొందిన తర్వాతే పనులు మొదలు పెడతామని మంత్రి స్పష్టమైన హామీ ఇచ్చారు.

ప్రాజెక్టుల నిర్మాణం అంటే ఒక పవిత్రమైన యజ్ఞం అని, కానీ గతంలో వాటిని కాంట్రాక్టర్ల లాభాల కోసం వాడారని ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. సురక్షితమైన నిర్మాణాల కోసం తాము ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామని, భద్రతా ప్రమాణాలకు ఏమాత్రం రాజీ పడబోమని తెలిపారు. ఇంజనీరింగ్ లోపాలను సరిదిద్దడమే కాకుండా, బ్యారేజీల మొత్తం స్ట్రక్చరల్ ఇంటిగ్రిటీని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పునరుద్ధరణ పనులు పూర్తయిన తర్వాతే రైతుల ఆందోళనలు తీరుతాయని, వారికి పూర్తి భరోసా కల్పించేందుకే ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఉద్ఘాటించారు. మేడిగడ్డ పునరుద్ధరణ ప్రక్రియలో సాంకేతికతకు ప్రాధాన్యతనిస్తూనే, కాలయాపన జరగకుండా పర్యవేక్షణ చేస్తున్నామని మంత్రి తెలిపారు. నీటిపారుదల శాఖలోని అగ్రశ్రేణి ఇంజనీర్లను ఈ బాధ్యతల్లో భాగస్వాములను చేశామని, ప్రతి వారం పురోగతిని సమీక్షిస్తున్నామని వివరించారు. ఎన్‌డీఎస్ఏ గుర్తించిన లోపాలను అత్యంత తీవ్రంగా పరిగణించి, వాటిని శాశ్వతంగా పరిష్కరించే దిశగా డిజైన్లు రూపొందిస్తున్నామని చెప్పారు. కేవలం తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా, దశాబ్దాల పాటు బ్యారేజీలకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం పారదర్శకతకు కట్టుబడి ఉందని, ప్రతి దశలోనూ నివేదికలను బహిర్గతం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమం కోసమే ఇన్ని కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని, ఏ ఒక్క పైసా దుర్వినియోగం కాకుండా చూడటమే తమ బాధ్యతని వివరించారు. మేడిగడ్డ మాత్రమే కాకుండా రాష్ట్రంలోని ఇతర ప్రాజెక్టుల స్థితిగతులపై కూడా నివేదికలు సేకరిస్తున్నామని, నీటి పారుదల రంగాన్ని పటిష్టం చేసేందుకు ఒక సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తామని వెల్లడించారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన తప్పిదాల వల్ల రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని, తమ ప్రభుత్వం పునరుద్ధరణ పనుల ద్వారా పూడ్చడానికి కృషి చేస్తుందని మంత్రి మరోమారు పునరుద్ఘాటించారు. పునరుద్ధరణ పనులు పూర్తయ్యాక, మేడిగడ్డ బ్యారేజీ మళ్లీ సస్యశ్యామల తెలంగాణకు నిదర్శనంగా నిలుస్తుందని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో నీటి నిల్వ సామర్థ్యం తగ్గకుండా, భద్రతా ప్రమాణాలతో బ్యారేజీలను సిద్ధం చేస్తామన్నారు.

# వరి వేస్తే ఉరేనా?

**మొదటిపేజీ తరువాయి**

ఎకరాల్లో వరి నాట్లు వేశారు. తెలంగాణలో రెండు సీజన్లు కలిపి మొత్తంగా 129.80 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. దేశంలో అత్యధిక వరి సాగు చేస్తున్న రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో ఉంటే, తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. దిగుబడి వచ్చిన తర్వాత ధాన్యం కొనుగోళ్ల అంశం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నిత్యం వివాదాస్పదంగా మారుతోంది. పండిన ప్రతి గింజను కొనుగోలు చేయాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వం పట్టుబడుతుండటం కేంద్రానికి పెద్ద తలనొప్పిగా పరిణమించింది. వరి సాగును విపరీతంగా పెంచడం వల్ల ప్రభుత్వ ఖజానాపై ఆర్థిక భారం పెరగడమే తప్ప రైతుకు అంతగా ప్రయోజనం ఉండటం లేదని కేంద్ర వ్యవసాయ శాఖ వాదిస్తోంది. వరి సాగు కోసం భారీగా భూగర్భ జల వనరులను వినియోగించడం, విచ్చలవిడిగా ఉచిత విద్యుత్ వాడకం, కనీస మద్దతు ధర అమలు భారమై కూర్చున్నాయి. నిత్యం జలాలను మడులకు పారించాల్సి ఉండటం వల్ల వనరుల దుర్వినియోగం జరుగుతోందని, నీటి పారకం లేకుంటే పంట ఎండిపోయే ప్రమాదం ఉంటుందని కేంద్రం ఆందోళన చెందుతోంది. ఈ సమస్యలన్నింటిని పరిగణనలోకి తీసుకుని నీతి ఆయోగ్ రాష్ట్రాల వారీగా లోతైన విశ్లేషణ చేసింది. వరి సాగు పెరగడం వల్ల తలెత్తుతున్న సమస్యలు, ప్రభుత్వాలపై పడుతున్న ఆర్థిక భారం, దిగుబడి తర్వాత కొనుగోళ్లలో ఎదురవుతున్న ఇబ్బందులను బేరీజు వేసింది. బోనస్ ప్రకటించడం వల్ల రాష్ట్రాల ఖజానాపై అదనపు భారం పడుతుందనేది నీతి ఆయోగ్ అభిప్రాయం. సాగునీరు, విద్యుత్, ఎరువులు, పెట్టుబడి వ్యయం, దిగుబడి, మద్దతు ధర వంటి అంశాలన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించిన



తర్వాత, నీతి ఆయోగ్ నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వరి నుంచి రైతులను మళ్లించడం ద్వారా మాత్రమే ఈ సంక్షోభాన్ని అధిగమించగలమని నీతి ఆయోగ్ భావిస్తోంది. 202627 ఆర్థిక సంవత్సరం నుంచి ఐదేళ్ల పాటు ప్రతి ఏడాది ఐదు లక్షల ఎకరాల చొప్పున వరి సాగు తగ్గించాలని నీతి ఆయోగ్ ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఈ లక్ష్యాన్ని ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, తెలంగాణ రాష్ట్రాలు తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనని సూచించింది. కేవలం సాగు తగ్గించడమే కాకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాల్లో పేర్కొంది. వరి కంటే తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో పండే ఇతర పంటలను ఎంచుకుంటే రైతుకు అధిక ఆదాయం లభిస్తుందని, ప్రభుత్వాలపై భారం తగ్గుతుందని నీతి ఆయోగ్ అంచనా వేసింది. కానీ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఈ ఆదేశాలను రైతులకు అర్థమయ్యేలా వివరించడంలో పూర్తిగా విఫలమైంది. అసలు విషయాన్ని దాచిపెట్టడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఇటు రైతులకు, అటు తన ప్రతిష్టకు నష్టం చేకూర్చుకుంటోంది. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు పైపైన చెబుతున్నప్పటికీ, కేంద్రం జారీ చేసిన నిర్దిష్ట ఆదేశాల గురించి ఏమాత్రం స్పష్టత ఇవ్వడం లేదు. దీనివల్ల రైతుల్లో తీవ్రమైన గందరగోళం నెలకొంది. వచ్చే సీజన్‌లో ఏ పంట వేయాలో, వరి వేస్తే కొనుగోలు చేస్తారో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం సరైన అవగాహన కల్పించకపోవడం వల్ల రైతులు అభద్రతాభావంతో ఇబ్బందులు పడుతున్నారు. పంట మార్పిడి ప్రయోజనాల గురించి క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉన్నా, అది జరగడం లేదు. వరి సాగు తగ్గించాలనే కేంద్రం నిర్ణయాన్ని రాష్ట్రం ఎందుకు దాచి పెడుతుందనేది ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశంగా మారింది. ప్రతిపక్షాలు ఈ అంశాన్ని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు వాడుకుంటున్నాయి. వ్యవసాయ శాఖ తీరు వల్ల ప్రభుత్వానికి వ్యతిరేకత పెరుగుతోంది. రైతుల శ్రేయస్సు కోరే ప్రభుత్వమైతే, నిజానిజాలను పారదర్శకంగా వెల్లడించాల్సి ఉంటుంది. కేంద్రం విధించిన ఈ ఐదు లక్షల ఎకరాల కోత వల్ల ఏయే జిల్లాల్లో, ఏయే ప్రాంతాల్లో వరి సాగు తగ్గించాలో ఒక ప్రణాళిక సిద్ధం చేసి రైతులకు ముందే తెలియజేయాలి. అలా చేయకుండా అస్పష్టత కొనసాగిస్తే పంట చేతికి వచ్చే సమయానికి రైతులు తీవ్ర నష్టాల బారిన పడతారు. ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, మార్కెటింగ్ సదుపాయాలను ప్రభుత్వం కల్పించాలి. కేవలం వరి వద్దు అని చెబితే సరిపోదు, ఆ స్థానంలో వేసే పంటకు కూడా లాభసాటి ధర లభించేలా హామీ ఇవ్వాలి. నీతి ఆయోగ్ సూచించిన విధంగా పంట మార్పిడి చేపడితే భూగర్భ జలాలు పెరుగుతాయి, నేల సారం కాపాడబడుతుంది, ప్రభుత్వ ఖజానాపై భారం తగ్గుతుంది. ఇవన్నీ రైతులకు వివరించి వారిని చైతన్యం చేయాల్సిన బాధ్యత రాష్ట్ర వ్యవసాయ శాఖపై ఉంది. రైతుకు నమ్మకం కలిగించడమే ప్రభుత్వ ప్రాథమిక కర్తవ్యం. ఆ దిశగా అడుగులు పడనంత వరకు రైతుల అయోమయం తొలగదు.

# మోదీ@12 ఏళ్లు



**మొదటిపేజీ తరువాయి**

తొలిసారిగా ఎన్నికైన ప్రధానిగా మే 13న ప్రమాణం చేసి, 1964 మే 27 వరకు 4,398 రోజుల పాటు పదవిలో కొనసాగారు. 1947 నుంచి 1964 మధ్య ఆయన మొత్తం 16 సంవత్సరాల 286 రోజుల పాటు ప్రధానిగా సేవలందించినప్పటికీ, అందులో 1947 నుంచి 1952 వరకు మధ్యంతర ప్రభుత్వానికి అధిపతిగా ఉన్నారు. నెహ్రూ హయాంలో దేశంలో మొదటిసారిగా 1952లో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల నుంచే ఆయన ఎన్నికైన ప్రధానిగా లెక్కించబడ్డారు. నరేంద్ర మోదీ 2014, 2019, 2024 వరుసగా మూడు సార్వత్రిక ఎన్నికలలో విజయం సాధించి, 12 సంవత్సరాలకు పైగా అప్రతిహతంగా ప్రయాణం సాగించి ఈ అరుదైన మైలురాయిని దాటారు. ఇందిరా గాంధీ 1966 నుంచి 1984 వరకు సుమారు 14 సంవత్సరాల పాటు పదవిలో ఉన్నప్పటికీ, ఆమె ప్రస్థానం మధ్యలో విరామాలతో సాగింది. ఎమర్జెన్సీ అనంతర ఎన్నికలలో ఆమె ఓటమిని చవిచూడటంతో ఆ పదవీకాలం నిరంతరాయంగా కొనసాగలేదు. కానీ మోదీ వరుసగా మూడు పర్యాయాలు పూర్తిస్థాయి ప్రజా తీర్పుతో పదవిలో కొనసాగడం గమనార్హం. 1947 తర్వాత దేశంలో పెను మార్పులు చోటుచేసుకున్నాయి. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం నుంచి మౌలిక వసతుల కల్పన వరకు మోదీ ప్రభుత్వం చేపట్టిన చర్యలు దేశాన్ని ప్రపంచ దేశాల సరసన నిలబెట్టాయి. ఆయన పాలనలో భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా గుర్తింపు పొందింది.ప్రధాని మోదీ సాధించిన ఈ ఘనతపై ప్రపంచ వేదికల నుంచి ప్రశంసల జల్లు కురుస్తోంది. శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిశానాయకే లేఖ ద్వారా అభినందనలు తెలియజేశారు. ఆయన నాయకత్వంపై భారత ప్రజలు ఉంచిన నమ్మకానికి ఈ 4,399 రోజుల ప్రస్థానం ఒక నిదర్శనమని దిశానాయకే పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నాయకులు ఆయనను పరివర్తనాత్మక పాలనాదక్షుడిగా అభివర్ణిస్తున్నారు. గ్లోబల్ సౌత్ దేశాల గళాన్ని ప్రపంచ వేదికలపై బలంగా వినిపించడంలో మోదీ పాత్ర అద్వితీయమని పలువురు నాయకులు కొనియాడుతున్నారు. ఆయన దార్శనికత భారతదేశాన్ని ఆర్థికంగా, సామాజికంగా చైతన్యవంతం చేసింది. పపువా న్యూ గినియా ప్రధానమంత్రి జేమ్స్ మారాపే మోదీని ఒక ఆదర్శప్రాయుడిగా అభివర్ణించారు. సుమారు 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకురావడం అనేది ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందని మారాపే ఒక వీడియో సందేశంలో పేర్కొన్నారు. సామాన్య కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన వ్యక్తి 140 కోట్ల జనాభా ఉన్న దేశానికి మూడుసార్లు నాయకత్వం వహించడం ఒక అసాధారణ ప్రస్థానం. పేదరికం లేని భారత్ అనే లక్ష్యం దిశగా ఆయన వేస్తున్న అడుగులు సామాన్యుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి. మౌలిక వసతుల రంగంలో భారతదేశం సాధించిన ప్రగతి నేడు ప్రపంచానికే ఒక పాఠంగా మారుతోంది. ట్రినిడాడ్ టొబాగో మాజీ ప్రధాన మంత్రి కమలా ప్రసాద్‌బిస్సెసర్ కూడా ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. ఆయన నాయకత్వంలో భారత్ ప్రపంచ వ్యవహారాల్లో అత్యంత కీలకమైన స్వరం కలిగి ఉందని ఆమె విశ్లేషించారు. విదేశాంగ విధానం, మౌలిక సదుపాయాలు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వంటి రంగాల్లో భారత్ అద్భుత విజయాలను సాధించింది. 140 కోట్ల మంది ప్రజల విశ్వాసాన్ని చూరగొనడం ద్వారా, అంతర్జాతీయ స్థాయి ఆమోదాన్ని పొందడం ఆయనకే సాధ్యమైంది. మోదీ వ్యూహాత్మక ఆలోచనలు దేశ భవిష్యత్తును నిర్ణయించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఈ విజయాల వెనుక ఆయన నిరంతర కృషితో పాటు, దేశాన్ని అగ్రపథంలో నిలబెట్టాలనే దృఢ సంకల్పం ఉంది. యూఎస్ సెనేటర్ జాన్ కార్నిన్, మోదీ పాలన పరివర్తనాత్మకమైనదని కొనియాడారు. 4,399 రోజుల నాయకత్వం అనేది కేవలం సంఖ్య మాత్రమే కాదు, అది ఒక దేశ ప్రయాణపు సాక్ష్యమని ఆయన అన్నారు. టెక్సాస్‌కు చెందిన ఈ రిపబ్లికన్ సెనేటర్, అమెరికా-భారత భాగస్వామ్యం నేడు ఇంత పటిష్టంగా ఉండటానికి మోదీ నాయకత్వమే కారణమని స్పష్టం చేశారు. మూడు ప్రజాస్వామ్య పర్యాయాల్లో ప్రజల విశ్వాసం పొందడం అంటే, ఆయన పాలనలో ఉన్న విశ్వసనీయతకు నిదర్శనం. ఆర్థిక సంస్కరణలు భారతదేశాన్ని గ్లోబల్ మ్యాప్‌లో అత్యంత ముఖ్యమైన కేంద్రంగా మార్చాయని కార్నిన్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ మోదీ పాలనలో రికార్డు స్థాయి వృద్ధిని నమోదు చేసింది. 2014లో ఉన్న స్థానంతో పోలిస్తే, నేడు ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా భారత్ ఎదిగింది. డిజిటల్ పేమెంట్స్ నుంచి అంతరిక్ష పరిశోధనల వరకు, భారత్ సాధించిన విజయాలు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. 25 కోట్ల మందిని పేదరికం నుంచి విముక్తులను చేయడం అనేది అంతర్జాతీయ సంస్థలు సైతం గుర్తించిన ఒక అద్భుతం. ఈ మార్పు కేవలం గణాంకాలకు పరిమితం కాకుండా, ప్రతి సామాన్యుడి జీవన ప్రమాణాల్లో ప్రతిబింబిస్తోంది. ఆయన పాలనలో మౌలిక వసతుల రంగంలో లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ప్రపంచ భౌగోళిక రాజకీయాల్లో భారతదేశం నేడు నిర్ణయాత్మక శక్తిగా మారింది. రష్యా-ఉక్రెయిన్ వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా భారత్ తన స్వతంత్ర విదేశాంగ విధానంతో ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. గ్లోబల్ సౌత్ దేశాల ప్రతినిధిగా భారత్ నేడు ఎదిగిన తీరు, మోదీ దార్శనికతకు ఒక నిదర్శనం. అమెరికా, రష్యా, యూరప్ దేశాలతో భారత్ సాగిస్తున్న బంధం నేడు అత్యున్నత స్థాయిలో ఉంది. ఈ అంతర్జాతీయ ఆమోదం మోదీ సాధించిన మరో అరుదైన రికార్డు. దేశంలోని సామాన్య పౌరుడికి కూడా ఈ ప్రగతి ఫలాలు అందుతుండటం ఆయన పాలనా దక్షతకు తార్కాణం. ప్రజాస్వామ్య విలువలను పాటిస్తూ, సుదీర్ఘ కాలం పాటు పరిపాలన సాగించడం ఒక సవాలుతో కూడిన విషయం.

# 2047 వరకు మోదీయే ప్రధాని

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



భారతీయ రాజకీయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక సరికొత్త అధ్యాయాన్ని ఆవిష్కరించారని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కీర్తించారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశ రాజకీయ చరిత్రలో మోదీ ఒక అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు. దశాబ్దాల పాటు అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును అధిగమించి, నరేంద్ర మోదీ సరికొత్త చరిత్ర సృష్టించడం యావత్ దేశానికే గర్వకారణమని ఆయన అభివర్ణించారు. భారతదేశ ప్రజాస్వామ్య ప్రస్థానంలో ఇది ఒక మైలురాయి అని, మోదీ నాయకత్వ పటిమకు ఇది నిదర్శనమని మంత్రి వ్యాఖ్యానించారు. ప్రస్తుతం భారతదేశం ప్రపంచ దేశాల సరసన అగ్రభాగాన నిలుస్తోందంటే అందుకు ప్రధానమంత్రి మోదీ చేపట్టిన విప్లవాత్మక నిర్ణయాలే కారణమని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఎనిమిది వందల ముప్పై ఏడు రోజుల కాలంలో ఆయన తీసుకున్న సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడమే కాకుండా, సామాన్యుడి జీవితంలో వెలుగులు నింపాయని పేర్కొన్నారు. కోట్లాది మంది ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ, దేశాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. అంతర్జాతీయ వేదికలపై భారత కీర్తి ప్రతిష్ఠలు శరవేగంగా పెరుగుతున్న తీరు చూస్తుంటే, రాబోయే కాలంలో భారత్ ప్రపంచానికి దిక్సూచిగా మారడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రెండు వేల నలభై ఏడు సంవత్సరం నాటికి భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా, ఒక విశ్వగురువుగా నిలబెట్టాలనే లక్ష్యంతో మోదీ ముందుకు సాగుతున్నారని బండి సంజయ్ వివరించారు. దేశ సమగ్రత, సార్వభౌమాధికారం విషయంలో రాజీ పడని ధోరణితో ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల హృదయాలను గెలుచుకున్నాయని తెలిపారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా వందల కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుతున్నాయని చెప్పారు. మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం అవినీతి రహిత పాలనను అందిస్తూ, పారదర్శకతకు పెద్దపీట వేస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఇదే మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు సంబంధించిన వివాదంపై మంత్రి బండి సంజయ్ స్పందించారు. ఆ వ్యవహారం పూర్తిగా కేంద్ర ఎన్నికల కమిషన్ పరిధిలోని అంశమని, ఇందులో రాజకీయ జోక్యం ఏమీ లేదని కుండబద్దలు కొట్టారు. చట్టప్రకారం ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా వ్యవహరిస్తుందని, నిబంధనలను అతిక్రమిస్తే ఎవరి నామినేషన్ అయినా తిరస్కరణకు గురికావడం సహజమని తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం ప్రతి విషయాన్ని వివాదాస్పదం చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎన్నికల ప్రక్రియలో నిబంధనలు అందరికీ సమానమని, అందులో ఎటువంటి మినహాయింపులు ఉండవని మంత్రి పేర్కొన్నారు. రాజ్యసభకు పోటీ చేసే అభ్యర్థులు అన్ని అర్హతలు కలిగి ఉండాలని, సాంకేతిక లోపాలు ఉన్నప్పుడు ఈసీ తీసుకునే చర్యలను రాజకీయ కోణంలో చూడటం తగదని హితవు పలికారు. చట్టం తన పని తాను చేసుకుపోతుంటే, దానికి రాజకీయ రంగు పులమడం ద్వారా కాంగ్రెస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సంఘం నిర్ణయంపై అనవసర రాద్ధాంతం చేయడం ద్వారా తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవాలని ఆ పార్టీ చూస్తోందని ఆయన ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలను బలోపేతం చేసే క్రమంలో ఎన్నికల సంఘం తీసుకునే కఠిన నిర్ణయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు. అక్రమాలకు తావులేకుండా పారదర్శకమైన ఎన్నికల ప్రక్రియను నిర్వహించడం ఎన్నికల కమిషన్ బాధ్యత అని వివరించారు. నియమ నిబంధనల అమలులో ఈసీ కఠినంగా వ్యవహరిస్తున్నందునే ప్రజాస్వామ్యం నిలబడుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని, చట్టపరమైన అంశాలను రాజకీయ కక్ష సాధింపుగా చూపడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి మోదీ పాలనలో దేశం సాధిస్తున్న పురోగతిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు ఇటువంటి ఆరోపణలు చేస్తున్నాయని బండి సంజయ్ అభిప్రాయపడ్డారు. దేశంలోని మూడు ప్రధాన రాజకీయ ధృవాల మధ్య జరుగుతున్న పోరాటంలో ప్రజలు ఎప్పుడో మోదీకే పట్టం కట్టారని ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమం, జాతీయవాదం అనే మూడు సూత్రాలతో ప్రభుత్వం ముందుకెళ్తోందని తెలిపారు. లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, దేశాన్ని సాంకేతిక రంగంలో ప్రపంచ అగ్రదేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మోదీ కృషి చేస్తున్నారని కొనియాడారు. కరీంనగర్ జిల్లా అభివృద్ధిపై కూడా స్పందించిన ఆయన, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వల్ల స్థానికంగా ఎంతో మార్పు వచ్చిందని చెప్పారు. రహదారుల నిర్మాణం, నీటి పారుదల సౌకర్యాలు, విద్యుత్ సరఫరాలో వచ్చిన గణనీయమైన మార్పులను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ప్రతి గ్రామాన్ని స్వయం సమృద్ధం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం వాటిని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమవుతోందని ఆరోపించారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

# రైతుల పొట్ట కొట్టొద్దు..!





**మొదటిపేజీ తరువాయి**

హక్కుల కోసం వీధులెక్కి పోరాడుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం పారిశ్రామిక హబ్‌గా మార్చడమే లక్ష్యంగా భూసేకరణ ప్రక్రియను ఎటువంటి అభ్యంతరాలను లెక్కచేయకుండా దూకుడుగా ముందుకు తీసుకెళ్తోంది. స్థానిక రైతులు తమ పొలాల్లో కూలీలుగా మారే దుస్థితి ఎదురవుతుందని గొంతెత్తి నిరసిస్తున్నారు. ఈ భూసేకరణ ప్రక్రియలో పారదర్శకత లోపించడం వల్ల రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పరిహారం చెల్లింపులు, ప్లాట్ల కేటాయింపు విషయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితం కావడం రైతుల ఆశలను అడియాసలు చేస్తోంది. ఎకరానికి 120 గజాల చొప్పున ప్లాట్లు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం, ఇప్పటివరకు సరైన రిజిస్ట్రేషన్ పత్రాలను అందించకపోవడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని రైతులు అనుమానిస్తున్నారు. కేవలం ఒక హామీ పత్రం తప్ప, భూమిపై పూర్తిస్థాయి యాజమాన్య హక్కులను కల్పించే రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టకపోవడంతో రైతులు తీవ్ర అయోమయానికి లోనవుతున్నారు. ప్రభుత్వ హామీల అమలులో జరుగుతున్న జాప్యం రైతుల నమ్మకాన్ని పూర్తిగా దెబ్బతీసింది. న్యాయ వ్యవస్థ జోక్యం చేసుకుని గతంలో స్టే విధించినప్పటికీ, స్థానిక అధికారులు నిబంధనలను అతిక్రమిస్తూ భూసేకరణను కొనసాగించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. న్యాయస్థానం ఆదేశాలను బేఖాతరు చేస్తూ వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై రైతులు హైకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు. ఒకవైపు చట్టబద్ధమైన హక్కుల కోసం పోరాడుతుంటే, మరోవైపు బలవంతపు సేకరణతో ప్రభుత్వం రైతుల గొంతు నొక్కుతోందని ప్రజా సంఘాలు హెచ్చరిస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రైతులకు దక్కాల్సిన కనీస గౌరవం, రక్షణ ఈ ప్రక్రియలో ఎక్కడా కనిపించడం లేదని వారు ఆవేదన చెందుతున్నారు. న్యాయం కోసం ఏళ్ల తరబడి పడిగాపులు కాయడం రైతులకు పరిపాటిగా మారింది. పరిశ్రమల ఏర్పాటు వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని పర్యావరణవేత్తలు చేస్తున్న హెచ్చరికలు స్థానికులను మరింత భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఫార్మా కంపెనీల నుండి వెలువడే వ్యర్థాల వల్ల భూగర్భ జలాలు కలుషితమై, వ్యవసాయం పూర్తిగా అంతరించిపోయే ప్రమాదం ఉందని వారు విశ్లేషిస్తున్నారు. ఈ ప్రాంతంలోని సహజసిద్ధమైన పర్యావరణం కనుమరుగై, పారిశ్రామిక కాలుష్యంతో మనుగడ సాగించడం కష్టతరమవుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తమ బతుకుదెరువును దెబ్బతీసే ఇటువంటి భారీ ప్రాజెక్టులు స్థానికుల ప్రయోజనాలకు భంగకరమని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్ తరాల కోసం భూమిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను వారు గుర్తు చేస్తున్నారు. రాజకీయ పార్టీల వైఖరి ఈ భూ వివాదంలో కీలకాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఫార్మా సిటీని రద్దు చేస్తామని రైతులకు భరోసా ఇచ్చినప్పటికీ, అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితుల్లో మార్పు రాకపోవడం గమనార్హం. హామీలు ఇచ్చినప్పుడు అండగా ఉంటామని చెప్పిన నాయకులు, ఇప్పుడు అధికార పీఠం ఎక్కాక మాట మారుస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం రైతుల ప్రాణాలను, జీవనోపాధిని పణంగా పెట్టడం సరికాదని వారు హెచ్చరిస్తున్నారు. పార్టీలు మారుతున్నా, రైతుల జీవితాల్లో మార్పు రాకపోవడం ప్రభుత్వాల వైఫల్యానికి నిదర్శనమని వారు విమర్శిస్తున్నారు. రాజకీయ పార్టీల హామీలు కేవలం ఓట్ల కోసమేనని రైతులు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఫార్మా సిటీ స్థానంలో ఫ్యూచర్ సిటీ పేరుతో కొత్త ప్రాజెక్టును ప్రకటించడం మరొక వివాదానికి తెరతీసింది. సుమారు 765 చదరపు కిలోమీటర్ల భారీ విస్తీర్ణంలో 56 రెవెన్యూ గ్రామాలను ఈ నూతన ప్రాజెక్టు పరిధిలోకి తీసుకురావడం రైతులను మరింత ఆందోళనలోకి నెట్టింది. 2025 మార్చి నాటికి ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించాలని ప్రభుత్వం పట్టుదలతో ఉండగా, పాత బాధితుల సమస్యలు అపరిష్కృతంగానే మిగిలిపోయాయి. కొత్త పేరుతో కొత్త ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందేమోనని, తమ భూములకు ఏమవుతుందోనన్న భయం ఆయా గ్రామాల్లోని ప్రజలను నిద్రపోనివ్వడం లేదు. ప్రాజెక్టుల విస్తృతి పెరగడం పట్ల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అధికారులు మాత్రం భూసేకరణ ప్రక్రియ చట్టబద్ధంగానే సాగుతోందని బుకాయిస్తుండగా, క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. బలవంతపు సేకరణతో బతుకులు వీధిన పడే పరిస్థితి ఉందని ప్రజా సంఘాలు నిరసనలు తెలుపుతున్నాయి. రైతులకు సరైన పరిహారం చెల్లించడంతో పాటు వారి పునరావాసానికి స్పష్టమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కేవలం పారిశ్రామికాభివృద్ధి మాత్రమే లక్ష్యంగా పెట్టుకోకుండా, భూములను కోల్పోయే అన్నదాతల జీవితాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు గుర్తు చేస్తున్నారు. రైతుల డిమాండ్లను పరిష్కరించడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వానికి, రైతులకు మధ్య జరుగుతున్న ఈ సుదీర్ఘ పోరాటం ఏ మలుపు తిరుగుతుందోనన్న ఉత్కంఠ రంగారెడ్డి జిల్లాలో నెలకొంది. రైతులు తమ భూములను దక్కించుకుంటారా లేక పారిశ్రామికీకరణ పేరుతో అన్యాక్రాంతం అవుతాయా అన్నది రాబోయే రోజుల్లో తేలాల్సి ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులతో చర్చలు జరిపి, వారి అనుమానాలను నివృత్తి చేసి పారదర్శకమైన పరిష్కారాన్ని చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అన్యాయంగా భూములను కోల్పోయి, నిరాశ్రయులుగా మారే పరిస్థితి రాకూడదని, రైతుల కష్టార్జితానికి రక్షణ కల్పించాలని మేధావులు, సామాజిక కార్యకర్తలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. రైతు ఆవేదనను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మొత్తంగా, ఈ భూసేకరణ వివాదం కేవలం భూముల సమస్య మాత్రమే కాకుండా, రైతుల ఉనికిని, వారి హక్కులను కాపాడే ధర్మయుద్ధంగా మారింది. దశాబ్ద కాలంగా సాగుతున్న ఈ వేదనకు ముగింపు పలికేలా ప్రభుత్వం స్పష్టమైన విధాన నిర్ణయాలు తీసుకోవాలని బాధితులు ఆశిస్తున్నారు. ఫ్యూచర్ సిటీ రూపంలో వస్తున్న మార్పులు రైతులకు మేలు చేసేలా ఉండాలే తప్ప, వారి కడుపు కొట్టే విధంగా ఉండకూడదని ఆ ప్రాంత ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. రైతుల ఆవేదనను అర్థం చేసుకుని, వారి హక్కులకు భరోసా కల్పించడం ద్వారానే ప్రజాస్వామ్య ప్రభుత్వం తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించినట్లవుతుందని అందరూ అభిప్రాయపడుతున్నారు. రైతుల కన్నీళ్లను తుడిచే సమయం ఆసన్నమైందని బాధితులు గొంతెత్తి చాటుతున్నారు.







# మీనాక్షికి అన్యాయం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాజకీయ రంగులు మారుతున్న వేళ, నిబద్ధతకు నిలువుటద్దంగా నిలిచిన నాయకురాలు మీనాక్షి నటరాజన్. విలువలతో కూడిన రాజకీయాలు కనుమరుగవుతున్న తరుణంలో, ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడుపుతూ కాంగ్రెస్ పార్టీలో ప్రత్యేక ముద్ర వేసుకున్న ఆమె పేరు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురికావడం కేవలం ఒక సాంకేతిక అంశం మాత్రమే కాదని, దీని వెనుక పెద్ద రాజకీయ కుట్ర దాగి ఉందని ఆమె అభిమానులు భావిస్తున్నారు. ఎటువంటి క్రిమినల్ కేసులు లేని వ్యక్తిపై చిన్న కోర్టు నోటీసును అస్త్రంగా చేసుకుని అనర్హత వేటు వేయడం రాజకీయ విశ్లేషకులను విస్మయానికి గురిచేస్తోంది. చట్టపరమైన చిక్కులను సాకుగా చూపి ప్రజాస్వామ్య విలువలను కాలరాయడంపై అన్ని వర్గాల నుండి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. వందేళ్ల క్రితమే మధ్యప్రదేశ్‌లో స్థిరపడిన తమిళ కుటుంబంలో జన్మించిన మీనాక్షి, విద్యార్థి దశ నుంచే రాజకీయ ప్రస్థానాన్ని మొదలుపెట్టారు. ఎన్ఎస్‌యుఐ ద్వారా అడుగుపెట్టి, తన వాగ్ధాటితో పార్టీ అగ్రనేతలను ఆకట్టుకున్నారు. ఎన్ఎస్‌యుఐ జాతీయ అధ్యక్షురాలిగా, మధ్యప్రదేశ్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా, కాంగ్రెస్ జాతీయ కార్యదర్శిగా ఆమె అంచెలంచెలుగా ఎదిగారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో యువజన విభాగాల బాధ్యతలు చేపట్టిన సమయంలో, ఆయన కోర్ టీమ్‌లో అత్యంత నమ్మకస్తురాలిగా గుర్తింపు పొందారు. ప్రజా సేవకే అంకితమైన ఆమె, అత్యంత నిరాడంబరంగా వ్యవహరిస్తూ పార్టీలో మేధావి వర్గం నేతగా చెలామణి అవుతున్నారు. డబ్బు రాజకీయాలు రాజ్యమేలుతున్న కాలంలో మీనాక్షి నటరాజన్ ఒక భిన్నమైన ఒరవడిని సృష్టించారు. 2009 లోక్‌సభ ఎన్నికల్లో మధ్యప్రదేశ్‌లోని మందసౌర్ నియోజకవర్గం నుండి పోటీ చేసి, 20 ఏళ్లుగా తిరుగులేని శక్తిగా ఉన్న బీజేపీ సీనియర్ నేత లక్ష్మీనారాయణ్ పాండేను ఓడించి రాజకీయ సంచలనం సృష్టించారు. ఎన్నికల ఖర్చుల నిమిత్తం పార్టీ ఇచ్చిన నిధులలో మిగిలిపోయిన భారీ మొత్తాన్ని ఆమె అప్పటి కాంగ్రెస్ ట్రెజరర్ మోతీలాల్ వోరాకు తిరిగి అప్పగించడం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. రాజకీయాల్లో ఖర్చు చేయాల్సిన డబ్బును కూడా వెనక్కి ఇచ్చేంతటి నిజాయితీ గల నేతగా ఆమె చరిత్రలో నిలిచిపోయారు. గత ఏడాది ఫిబ్రవరిలో ఆమెను తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా పార్టీ అధిష్ఠానం నియమించింది. ఇక్కడి రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకుని, పార్టీని బలోపేతం చేసే దిశగా ఆమె అడుగులు వేశారు. అయితే, నారాయణపేట అసెంబ్లీ సీటు ఆశించిన కాంగ్రెస్ నేతపై ఒక మహిళ చేసిన ఫిర్యాదు మీనాక్షి కెరీర్‌లో ఊహించని మలుపుగా మారింది. చట్టపరమైన సహాయం కోరాలని లేదా పార్టీ క్రమశిక్షణా కమిటీకి వెళ్లాలని బాధితురాలికి ఆమె సూచించారు. ఈ విషయంలో అసంతృప్తి చెందిన సదరు మహిళ కోర్టును ఆశ్రయించి, మీనాక్షిని కూడా తన పిటిషన్‌లో ప్రతివాదిగా చేర్చడం ఈ వివాదానికి మూలమైంది. కోర్టు నుండి నోటీసు వచ్చినప్పుడు ఆమె దానికి సకాలంలోనే సమాధానం ఇచ్చారు. అది ఎఫ్ఐఆర్ కాని కేసు, క్రిమినల్ నేరారోపణలు లేని వ్యవహారం కావడంతో, అఫిడవిట్‌లో పేర్కొనాల్సిన అవసరం లేదని ఆమె భావించారు. కానీ ప్రత్యర్థులు దీనిని సాకుగా తీసుకుని, ఉద్దేశపూర్వకంగా సమాచారాన్ని దాచారంటూ ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. రాజకీయ ప్రత్యర్థుల వ్యూహంలో చిక్కుకుని, కేవలం ఒక లీగల్ నోటీసును అడ్డుపెట్టుకుని ఆమె నామినేషన్‌ను రద్దు చేయించడం రాజకీయాల్లో మరో రకమైన వేధింపుగా మారింది. ఇది చట్టాన్ని దుర్వినియోగం చేయడమేనని మేధావులు గళమెత్తుతున్నారు. చట్టాల పట్ల పూర్తి అవగాహన ఉన్న మీనాక్షి నటరాజన్ వంటి సీనియర్ నేత అఫిడవిట్ నిబంధనలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘిస్తారా అనే ప్రశ్న ఆమె సన్నిహితులలో తలెత్తుతోంది. మూడు సార్లు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి, మరెన్నో ఎన్నికలను దగ్గరుండి పర్యవేక్షించిన 53 ఏళ్ల అనుభవజ్ఞురాలు, ఒక చిన్న నోటీసును దాచిపెట్టాల్సిన అవసరం ఆమెకు లేదు. అఫిడవిట్ నిబంధనల పట్ల ఆమెకు ఉన్న అవగాహనను తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ, దానినే నెపంగా చూపి అనర్హత వేటు వేయడం వెనుక రాజకీయ కోణం స్పష్టంగా కనిపిస్తోంది. ఒక మాజీ ఎంపీగా వచ్చే పెన్షన్, తను రాసిన కొన్ని పుస్తకాల ద్వారా వచ్చే స్వల్ప ఆదాయంతోనే ఆమె ఇప్పటికీ అత్యంత సాధారణ జీవితాన్ని గడుపుతున్నారు. కోట్లు సంపాదించే రాజకీయ నేతల మధ్య, పుస్తకాలే ఆస్తిగా బతుకుతున్న ఇలాంటి నేతలను రాజకీయాల నుండి దూరం చేయడం దురదృష్టకరం. కష్టపడి పైకి వచ్చిన విలువల నేతలకు ఎదురవుతున్న ఈ అడ్డంకులు, రాబోయే రోజుల్లో కొత్త తరం రాజకీయ నాయకులకు ఒక హెచ్చరికలా కనిపిస్తున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి పద్ధతులు కొనసాగితే సమర్థులైన నేతలు ఎన్నికల బరిలోకి దిగడానికి భయపడే ప్రమాదం ఉంది. కాంగ్రెస్ పార్టీలో అరుదైన నిఖార్సైన నేతగా గుర్తింపు పొందిన మీనాక్షి నటరాజన్ విషయంలో జరిగిన అన్యాయం పార్టీకి పెద్ద లోటు అని కార్యకర్తలు భావిస్తున్నారు. ఆమెపై ఉన్నది కేవలం ఒక రాజకీయ ఇష్యూ, అది కూడా ఒక లీగల్ నోటీసు మాత్రమేనని, దీనిని తీవ్రమైన క్రిమినల్ కేసులున్న నేతలతో పోల్చడం తగదని విశ్లేషకులు వాదిస్తున్నారు. ఒకరిపై బురద చల్లడానికి చట్టాన్ని ఒక ఆయుధంగా మార్చుకోవడం ప్రజాస్వామ్యానికి ఏమాత్రం మంచిది కాదు. విలువలతో రాజీపడకుండా బతికే నాయకురాలికి ఇలాంటి పరిస్థితులు ఎదురుకావడం పట్ల కాంగ్రెస్ శ్రేణుల్లో తీవ్ర ఆవేదన వ్యక్తం అవుతోంది. రాజకీయాల్లో నిజాయితీ, సూత్రబద్ధత అనేవి ఇప్పుడు అరుదైన వస్తువులయ్యాయి. మీనాక్షి నటరాజన్ వంటి నేతలు ఉండటం వల్లనే రాజకీయ వ్యవస్థపై ప్రజల్లో ఇంకా నమ్మకం సజీవంగా ఉంది. కానీ నామినేషన్ రద్దు వంటి ఘటనలు, వ్యవస్థపై ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయి. విలువలు పాటించే వ్యక్తికి జరిగిన అన్యాయం రాజకీయాల్లో మరిన్ని చర్చలకు దారి తీస్తోంది.

# జిల్లా వ్యాప్తంగా 'నో హెల్మెట్ – నో ఎంట్రీ' తీర్మానాలు





- ఒక్కరోజే 119 గ్రామ పంచాయతీలు, 9 వార్డుల్లో ఆమోదం
- గంజాయి సమాచారానికి రూ.5 వేల బహుమతి:
- ఎస్పీ డా. శబరీష్

**మహబూబాబాద్, విశాలభారతి :**

రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్ ధరించడం ప్రాణ రక్షణకు అత్యంత అవసరమని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ పేర్కొన్నారు. గూడూరు మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని "అరైవ్ అలైవ్" కార్యక్రమం కింద రహదారి భద్రత, గంజాయి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బందికి హెల్మెట్లు పంపిణీ చేసిన ఎస్పీ, హెల్మెట్ ధరించకపోవడం వల్లే అధిక శాతం రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం సంభవిస్తోందన్నారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన గ్రామసభల్లో ఒక్కరోజే 119 గ్రామపంచాయతీలు, 9 వార్డుల్లో "నో హెల్మెట్ - నో ఎంట్రీ" విధానాన్ని అమలు చేస్తూ ప్రత్యేక తీర్మానాలు ఆమోదించడం అభినందనీయమని అన్నారు. ఈ నిర్ణయం తీసుకున్న సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, పాలకవర్గ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. "మన ఊరు - మన బాధ్యత" కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని ఎస్పీ తెలిపారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, ట్రాఫిక్ నిబంధనల అమలు, గంజాయి రహిత గ్రామాల నిర్మాణం కోసం ప్రజలు ఏకగ్రీవంగా తీర్మానించడం సంతోషకరమన్నారు. గంజాయి నిర్మూలన కోసం జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్న ఆయన, గంజాయి విక్రయాలు లేదా సరఫరాపై 8712656999 నంబర్‌కు విశ్వసనీయ సమాచారం అందించిన వారికి రూ.5,000 నగదు బహుమతి అందజేస్తామని ప్రకటించారు. అదేవిధంగా మైనర్లు వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, సీట్ బెల్ట్ లేకుండా ప్రయాణించడం, వాహన నంబర్ ప్లేట్లలో మార్పులు చేయడం వంటి నిబంధనల ఉల్లంఘనలను ఉపేక్షించబోమని హెచ్చరించారు. ట్రాక్టర్ల వెనుక భాగంలో ఎరుపు రంగు రిఫ్లెక్టర్ స్టిక్కర్లు ఏర్పాటు చేసుకోవాలని, వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను ఎల్లప్పుడూ సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్, గూడూరు సీఐ విజయ్, ఎస్ఐ గిరిధర్, ఎంఆర్వో నాగభవాని, సర్పంచ్ సునీత, స్థానిక ప్రజా ప్రతినిధులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి

**పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా**



**విశాలభారతి, గోదావరిఖని :** పోలీసు శాఖలో అప్పగించిన బాధ్యతలను అధికారులు సమర్థవంతంగా, నిబద్ధతతో నిర్వహించాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీ అంబర్ కిశోర్ ఝా సూచించారు. ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల ఏఆర్ ఎస్ఐలుగా పదోన్నతి పొందిన సలీమ్, కొమురన్నలు పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారి భుజాలపై పదోన్నతి చిహ్నాలను పోలీస్ కమిషనర్ అలంకరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పదోన్నతి అనేది మరింత బాధ్యతతో కూడుకున్న అవకాశమని పేర్కొన్నారు. విధుల్లో ఎల్లప్పుడూ నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తూ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ఉన్నతాధికారుల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా విధులు నిర్వహించాలని తెలిపారు. పదోన్నతి పొందిన అధికారులు తమ బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# కార్మికుల సమస్య పరిష్కరించే బాధ్యత కాంగ్రెస్‌ది

**పబ్బు రాజు గౌడ్ మునుగోడు ఎన్నికల సమన్వయకర్త**



**చౌటుప్పల్ విశాలభారతి:** పట్టణ కేంద్రంలోనీ భవన నిర్మాణా కార్మికులతో కలిసి సంఘీభావం ప్రకటించిన చౌటుప్పల్ పట్టణ మరియు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ సందర్భంగా భవన నిర్మాణా కార్మికులను ఉద్దేశించి మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్..మాట్లాడుతూ కార్మికులు వారికి మరియు భావన నిర్మాణ యజమానులకి ఎంటువంటి సమస్యలు లేకుండా పరిష్కారం కోసం ఒక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని వాటిని మునుగోరు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకుపోయి వాటిని పరిష్కరించే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుంది అని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య ,మండల పార్టీ అధ్యక్షులు బోయ దేవేందర్ గారు, జిల్లా మత్య పారిశ్రామిక చైర్మన్ పాశం సంజయ్ బాబు గారు,మున్సిపల్ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి ,సింగల్ విండో వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య,ఆందోల్ మైసమ్మ చైర్మన్ కంచర్ల అశ్విన్ రెడ్డి గారు, కాంగ్రెస్ నాయకులు మరియు భవన నిర్మాణ కార్మికులు పాల్గొనారు.

# ఓటర్ల హక్కుల పరిరక్షణే లక్ష్యం

**మరిపెడలో కాంగ్రెస్ బీఎల్ఏల శిక్షణ శిబిరం**



**మరిపెడ విశాలభారతి:** మరిపెడలోని భార్గవ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బూత్ స్థాయి ప్రతినిధుల (బీఎల్ఏలు) శిక్షణ శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ ఆకర్ల నర్సిరెడ్డి, టీపీసీసీ కోఆర్డినేటర్లు డాక్టర్ పులి అనిల్ కుమార్, ఎండి అవిజ్ ఖాన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో బీఎల్ఏలు కీలక బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఓటరుకు తన ఓటు హక్కు అందేలా కృషి చేయాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొన్న ఆయన, బూత్ స్థాయిలో పార్టీ ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ స్థాయి ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమిష్టి కృషితో వార్డుల అభివృద్ధి

**మొగుదాల పావని రమేష్ గౌడ్ మున్సిపల్ కమిషనర్**



**చౌటుప్పల్ విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 4,5,6,14,15వ వార్డులో వార్డు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్పర్సన్ పావని రమేష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారై అనంతరం వారు మాట్లాడుతూ.. అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే వార్డుల అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఉదరి యాదయ్య, కోయడ శేఖర్, ఆలే శ్రీలత చిరంజీవి, ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్, గడ్డం ఇందిరా రాజరత్నం,మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు,వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అర్వపల్లి రాములమ్మ మృతికి సంతాపం తెలిపిన రెడ్యా నాయక్



**మరిపెడ విశాలభారతి:** మరిపెడ మండలం ఎజ్జర్ల గ్రామానికి చెందిన అర్వపల్లి రాములమ్మ బుధవారం కన్నుమూశారు. ఆమె మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఈ సందర్భంగా డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే శ్రీ డీఎస్ రెడ్యా నాయక్ ఎజ్జర్ల గ్రామానికి చేరుకుని రాములమ్మ భౌతికాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె కుమారులు అర్వపల్లి లింగయ్య, జగన్నాధంలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డం శ్రీను, భుక్య కిష్టు, రంజిత్, సలీం, గడ్డం పాపయ్య, మొగుళ్ల యాకయ్య, కోయిల లక్ష్మీనారాయణ, చిత్తనూరి బాబు, రామన్నతో పాటు గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొని రాములమ్మ నివాళులర్పించారు.

# కార్మిక సంక్షేమ బోర్డు ఎత్తివేసే కుట్రలు మానుకోవాలి

- ఢిల్లీ మాధవరెడ్డి బిఆర్టియు జిల్లా అధ్యక్షులు
- సుర్వి యాదయ్య గౌడ్ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు



**చౌటుప్పల విశాలభారతి:** మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘం సమ్మెకు మద్దతుగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సుర్వి యాదయ్య గౌడ్ మరియు బి ఆర్ టి యు అనుబంధ సంఘం మద్దతు ప్రకటించి సమ్మెలో పాల్గొని మద్దతు తెలియజేయడం జరిగింది.తదనంతరం బి ఆర్ టీ యు జిల్లా అధ్యక్షులు ఢిల్లీ మాధవరెడ్డి మాట్లాడుతూ... భవన నిర్మాణ కార్మికులకు న్యాయమైన డిమాండ్లు పరిష్కరించవలసిందిగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.కార్మిక సంక్షేమ బోర్డు ఎత్తివేసే కుట్రలు మానుకోవాలని కార్మికులకు న్యాయమైన డిమాండ్ పరిష్కరించుట విధంగా చూడాలని డిమాండ్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో చౌటుప్పల మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్ గౌడ్,బి ఆర్ ఎస్ మున్సిపాలిటీ కన్వీనర్ బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి,ఊదరి యాదయ్య,భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు గుండా బోయిన రాములు,బాల ముని,నరసింహ,చుక్క యాదయ్య,గౌరవ అధ్యక్షులు బండారి మార్ క్,మలియా,దశరధ బద్రి గాలయ్య,లందగిరి వెంకటేశం ఎర్రం శ్రీనివాస్,మునుకుంట్ల సత్యనారాయణ,దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి,రాకేష్,మున్నా,చెనగోని వెంకటేశం,బాతురాజు మహేష్,గజ్జల రాజు,బోడ నాగరాజు,యాదగిరి,లింగస్వామి,చామల వెంకటేష్, నరసింహ,వెంకటేష్ బిక్షపతి,రాజు,పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసం వార్డు బాట పడతా

**ప్రభుత్వ విప్ విజయరమణ రావు**

**విశాలభారతి పెద్దపల్లి:**

సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని 1,13,14,15 వార్డులకు సంబంధించిన వార్డు సభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు హాజరైనారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ విజయ రమణ రావు మాట్లాడుతూ..మున్సిపల్ కౌన్సిలర్లు నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారం పట్ల చిత్తశుద్ధితో పని చేయాలని అన్నారు. వచ్చే వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, నాళాలు ఎప్పటికప్పుడు శుభపరచుకోవాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తాను త్వరలోనే వార్డు బాట పడతానని చెప్పారు. సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో నాలుగైదు రోజులు పర్యటిస్తానని చెప్పారు. కౌన్సిలర్లు ఎప్పటికప్పుడు ప్రజాక్షేత్రంలో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఆయా వార్డుల్లో త్వరలోనే సిసి రోడ్ల నిర్మాణం ప్రారంభం అవుతుందన్నారు. ఇప్పటికే పట్టణంలో రోడ్ల వెడల్పు, సిసి రోడ్ల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నట్టు చెప్పారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామని స్పష్టం చేశారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఇప్పటివరకు 3 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను ఎలాంటి కటింగులు లేకుండా అనేక సమస్యలను అధిగమిస్తూ కొనుగోళ్లు పూర్తిచేసి, రైతుల సేవలో తరించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. రైతు భరోసా, రైతు భీమా, సన్న వడ్లకు బోనస్, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, ఉచిత కరెంటు, ఇందిరమ్మ ఇండ్లు వంటి అనేక సంక్షేమ పథకాలు చేపట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వా



నిదేనని చెప్పారు. రాబోయే రోజుల్లో అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మన్నలను పొందుతుండగా, బీఆర్ఎస్ ఓరువలేకపోతుందని చెప్పారు. ప్రతిపక్షాల ధర్నాలకు రైతులు రావడంలేదని స్వయంగా ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పేర్కొనడం కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని ఎమ్మెల్యే విజయరమణ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు

# చిన్నారులను ఆశీర్వదించిన మాజీ మంత్రి



**కురవి, విశాలభారతి:** కురవి మండల కేంద్రంలోని ఓం ఫంక్షన్ హాల్‌లో అవిరబోయిన వీరన్న గారి కుమార్తెలు రిషిత, షామినిల నూతన వస్త్రాలంకరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చిన్నారులకు నూతన వస్త్రాలు అందజేసి, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం శుభాకాంక్షలు తెలిపారు. పిల్లలు విద్య, సంస్కారం, మంచి విలువలతో ఎదిగి కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఐలి నరహరి గౌడ్, బోడ శ్రీను నాయక్, గుగులోత్ నెహ్రూ నాయక్, బాదే నాగయ్య, భద్రు నాయక్, ప్రముఖ జర్నలిస్ట్ సురేష్ తదితరులు పాల్గొని చిన్నారులకు ఆశీస్సులు అందజేశారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఉచిత వృత్తి విద్యా కోర్సులలో అవగాహన సదస్సు



**విశాలభారతి గోదావరిఖని:** రామగుండం ఏరియా 1 ఆధ్వర్యంలో స్థానిక నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత వృత్తి విద్యా కోర్సులలో శిక్షణ ఇచ్చేందుకు నిర్వహించిన అవగాహన సదస్సు మరియు పేర్ల నమోదు కార్యక్రమం ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్జీ 1 ఏరియా జనరల్ మేనేజర్ డీ. లలిత కుమార్.స్థానిక నిరుద్యోగులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో సింగరేణి సంస్థ ఆర్జీ 1 ఏరియా స్కిల్ డెవెలప్ మెంట్ సెంటర్ ఆద్వర్యంలో స్థానిక జియం కార్యాలయం దగ్గర గల కమ్యూనిటి హాలు నందు ఉచిత వృత్తి శిక్షణ కార్యక్రమాలను చేపట్టింది. ఇందులో భాగంగా సోలార్ టెక్నిషియన్, డ్రోన్ టెక్నాలజీ, గ్యాస్ కట్టింగ్ & వెల్డింగ్, కాస్మేటాలజీ, సెల్ ఫోన్ & సిసిటివి రిపేరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్ & డిటిపి డిజైన్ తదితర వినూత్న మరియు ఉపాధి ఆధారిత కోర్సులలో ఉచిత శిక్షణ పొందగోరు అభ్యర్థుల కోసం ఈ ప్రత్యేక సదస్సును ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్జీ 1 ఏరియా జనరల్ మేనేజర్ డీ. లలిత కుమార్ మాట్లాడుతూ, సింగరేణి సంస్థ కేవలం బొగ్గు ఉత్పత్తిలోనే కాకుండా సామాజిక బాధ్యతలో భాగంగా స్థానిక యువతకు ఉపాధి మార్గాలు చూపడంలో ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. ప్రస్తుత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా డ్రోన్ టెక్నాలజీ, సోలార్ వంటి ఆధునిక కోర్సులను ప్రవేశపెట్టామని, నిరుద్యోగులు ఈ ఉచిత శిక్షణా అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా స్థిరపడాలని అభ్యర్థులకు కోర్సుల ప్రాధాన్యతను, భవిష్యత్తులో ఉండే ఉపాధి అవకాశాలను వివరించారు. అలాగే ఇట్టి కోర్సులు నేర్చుకొనుటకు పరిసర ప్రాభవిత గ్రామాల నిరుద్యోగ యువతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వబడును. కావున ఇట్టి అవకాశం సద్వినియోగ పరిచుకోవాల్సిందిగా జియం తెలిపారు.ఈ సదస్సులో ఎస్.ఓ టు జియం చంద్రశేఖర్, జివిటిసి మేనేజర్ మాధవరెడ్డి, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం ప్రతినిధి రావుల దామోదర్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ రంగు శ్రీను,హెడ్ డోంగ్రీ రాకేష్ పనికంటి రాకేష్ సోషల్ ఇన్నోవేషన్ అసిస్టెంట్ టాస్క్ మేనేజర్ మంథని, సీనియర్ పివోలు శ్రావణ్ కుమార్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. ఈ అవగాహన సదస్సుకు రామగుండం పరిసర ప్రాంతాల నుండి నిరుద్యోగ యువతీ యువకులు 400 మంది వరకు అభ్యర్థులు భారీ సంఖ్యలో తరలివచ్చి, తమ పేర్లను ఉత్సాహంగా నమోదు చేసుకున్నారు.

# డిఫై కిడ్స్ ప్రీప్రైమరీ స్కూల్ ఘన ప్రారంభం



**ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం**

**రాజేంద్రనగర్, విశాలభారతి**

రాజేంద్రనగర్ నియోజకవర్గ శాసనసభ్యులు టి. ప్రకాశ్ గౌడ్ చేతుల మీదుగా ఎడిఫై కిడ్స్ ప్రీప్రైమరీ స్కూల్ నూతనంగా ప్రారంభించబడింది. ఈ కార్యక్రమం టీఎన్జీవో కాలనీ, గణేష్ నగర్, కట్టేదన్ ప్రాంతంలో ఘనంగా నిర్వహించబడింది. స్థానిక ప్రజలు, నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, చిన్నారులకు నాణ్యమైన ప్రాథమిక విద్య అందించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. కొత్తగా ప్రారంభమైన ఈ పాఠశాల ద్వారా పిల్లలకు ఆధునిక విధానాల్లో విద్య అందించి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక నాయకులు మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో ఇలాంటి విద్యాసంస్థ ప్రారంభం కావడం ఎంతో ఆనందదాయకమని తెలిపారు. కార్యక్రమం ముగింపులో పాఠశాల సిబ్బందికి అభినందనలు తెలియజేశారు.

# హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరిద్దాం సురక్షితంగా ఇంటికి చేరుకుందాం

**పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి**

**విశాలభారతి పెద్దపల్లి:**



పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలి.ప్రవర్తనలో మార్పులు కనిపిస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలి.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభల్లో భాగంగా, రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధిలోని హనుమంతునిపేట గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "అరైవ్అరైవ్" కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతా నియమాలు,రోడ్డు సేఫ్టీ, హెల్మెట్ వినియోగం,సీట్‌బెల్ట్ ధరించడం,నిర్లక్ష్యపు డ్రైవింగ్,మైనర్ డ్రైవింగ్,గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ,పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. తల్లిదండ్రుల పట్ల గౌరవం,గురువుల పట్ల భక్తి కలిగిన విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ప్రస్తుతం మాదకద్రవ్యాల వ్యసనం యువతను తీవ్రంగా ప్రభావితం చేస్తోందని,డ్రగ్స్‌కు అలవాటు పడిన పిల్లల్లో ప్రవర్తనలో స్పష్టమైన మార్పులు కనిపిస్తాయని తెలిపారు.ఇంట్లో వస్తువులు ధ్వంసం చేయడం, తల్లిదండ్రులను బెదిరించడం, అవసరం లేని డిమాండ్లు చేయడం, మానసిక ఒత్తిడికి గురిచేయడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలని సూచించారు. అటువంటి పరిస్థితుల్లో తల్లిదండ్రులు భయపడకుండా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని, పోలీసులు అవసరమైన కౌన్సెలింగ్ అందించడమే కాకుండా వైద్య నిపుణులు, మనోవైద్యుల సహాయంతో పిల్లలను సరైన మార్గంలో నడిపించేందుకు చర్యలు తీసుకుంటారని తెలిపారు.డ్రగ్స్ బారిన పడిన యువతలో కనిపించే లక్షణాలపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, నిపుణులు ఇప్పటికే అవగాహన కల్పించారని పేర్కొంటూ,అలాంటి సంకేతాలు గమనించిన వెంటనే తల్లిదండ్రులు స్పందించాలని కోరారు.మాదకద్రవ్యాల నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని,డ్రగ్స్ నియంత్రణ కోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసి,ఉన్నతాధికారుల పర్యవేక్షణలో విస్తృత చర్యలు చేపడుతోందని తెలిపారు. యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడటం, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం ప్రభుత్వంతో పాటు ప్రతి పౌరుడి బాధ్యత అని డీసీపీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్వేత,ఆరోగ్య శాఖ అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు, విద్యాశాఖ ప్రధానోపాధ్యాయులు, నీటిపారుదల శాఖ అధికారులు,విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్ తదితరులు పాల్గొన్నారు.

# 8 ఏళ్ల బాలికకు వినికిడి పునరుద్ధరణ

- మలక్‌పేట్ యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో విజయవంతమైన చికిత్స
- మైక్రోటియాతో బాధపడుతున్న బాలికకు ఆధునిక OSIA–300 ఇంప్లాంట్
- బోన్ కండక్షన్ విధానంతో వినికిడి సామర్థ్యం మెరుగుదలకు అవకాశం
- ముందస్తు చికిత్సతో మాటలు, భాషా అభివృద్ధికి కీలక ప్రయోజనం

**విశాలభారతి, ఖమ్మం:**




పిల్లల్లో వినికిడి లోపం, ముఖ్యంగా పుట్టుకతోనే లేదా చిన్న వయస్సులోనే ఉంటే, మాటల అభివృద్ధి, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, అలాగే మొత్తం జీవన నాణ్యతపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మైక్రోటియా వంటి పరిస్థితుల్లో బయటి చెవి సరైన రీతిలో అభివృద్ధి చెందకపోవడం వల్ల వినికిడి లోపం ఏర్పడుతుంది. ఈ సమస్యను సమయానికి గుర్తించి చికిత్స చేయకపోతే, పిల్లల భాషా అభివృద్ధి ఆలస్యమవడంతో పాటు వారి విద్యా, సామాజిక అభివృద్ధిపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుంది. ఆధునిక ఈఎన్‌టీ వైద్యంలో బోన్ కండక్షన్ హియరింగ్ ఇంప్లాంట్లు (OSIA వంటి పద్ధతులు) సమర్థవంతమైన పరిష్కారాలుగా నిలుస్తున్నాయి. ఈ విధానంలో శబ్ద తరంగాలను నేరుగా అంతర్గత చెవికి పంపించడం ద్వారా బయటి లేదా మధ్య చెవిలో ఉన్న లోపాలను అధిగమించి వినికిడి సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది. కల్వకుర్తికి చెందిన 8 ఏళ్ల బాలికకు చిన్ననాటి నుంచే కుడి చెవిలో వినికిడి లోపం ఉండగా, మలక్‌పేట్ యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో విజయవంతంగా చికిత్స అందించారు. వైద్య పరీక్షల అనంతరం ఆమెకు 'రైట్ మైక్రోటియా విత్ హియరింగ్ లాస్' ఉన్నట్లు నిర్ధారించడంతో వైద్యులు శస్త్రచికిత్సను సూచించారు.

**అత్యాధునిక శస్త్రచికిత్స:**

కన్సల్టెంట్ ఈఎన్‌టీ సర్జన్ డా. రఘు కుమార్ ఎస్.సి.హెచ్ ఆధ్వర్యంలో 13022026న బాలికకు రైట్ బోన్ కండక్షన్ హియరింగ్ ఇంప్లాంట్ (OSIA-300) శస్త్రచికిత్సను సాధారణ మత్తులో (జనరల్ అనస్థీషియా) విజయవంతంగా నిర్వహించారు.

**శస్త్రచికిత్స ముఖ్యాంశాలు:**

- ఆధునిక OSIA-300 హియరింగ్ ఇంప్లాంట్ అమరిక
- మినిమల్లీ ఇన్వేసివ్ (స్వల్ప శస్త్రచికిత్స) విధానం
- బోన్ కండక్షన్ ద్వారా వినికిడి పునరుద్ధరణ
- ఈ శస్త్రచికిత్స ఎటువంటి అంతర్గత సమస్యలు లేకుండా విజయవంతంగా పూర్తైంది.
- శస్త్రచికిత్స అనంతర సంరక్షణ
- శస్త్రచికిత్స అనంతరం బాలికకు సమగ్ర వైద్య పర్యవేక్షణలో కింది చికిత్సలు అందించారు.
- ఐవీ ద్రవాలు , యాంటీబయాటిక్స్, నొప్పి నివారణ మందులు
- నిరంతర వైద్య పర్యవేక్షణ, సహాయక చికిత్సలు

పోస్ట్‌ఆపరేటివ్ దశ సజావుగా సాగి బాలిక ఆరోగ్యం మెరుగుపడింది. అనంతరం ఆమెను స్థిర స్థితిలో డిశ్చార్జ్ చేసి, ఫాలోఅప్ కోసం అవసరమైన సూచనలు ఇచ్చారు.

**అద్భుతమైన ఫలితం:**

డిశ్చార్జ్ సమయానికి బాలిక ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉంది.
వినికిడి మెరుగుదలకు అనుకూల పరిస్థితి ఏర్పడింది.
శస్త్రచికిత్స అనంతర ఎటువంటి సమస్యలు కనిపించలేదు.
రెగ్యులర్ ఫాలోఅప్‌కు వైద్యులు సూచించారు.

**వైద్యుల అభిప్రాయం:**

"మైక్రోటియా మరియు కండక్టివ్ హియరింగ్ లాస్ ఉన్న పిల్లల్లో OSIA వంటి బోన్ కండక్షన్ ఇంప్లాంట్లు అత్యంత సమర్థవంతమైన పరిష్కారం. ముందస్తు జోక్యం ద్వారా వినికిడి మెరుగుపడటంతో పాటు మాటల, భాషా అభివృద్ధికి ఇది కీలకంగా సహాయపడుతుంది. ఈ కేసులో సమయానికి శస్త్రచికిత్స చేయడం వల్ల బాలికకు మెరుగైన వినికిడి, భవిష్యత్ అభివృద్ధికి మంచి అవకాశం లభించింది" అని డా. రఘు కుమార్ ఎస్.సి.హెచ్ తెలిపారు.

**ఈ కేసు ప్రాధాన్యత:**

- పిల్లల్లో వినికిడి లోపాన్ని ముందుగానే గుర్తించడం అత్యంత అవసరం.
- మైక్రోటియా కేసుల్లో OSIA ఇంప్లాంట్ల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది.
- ఆధునిక ఈఎన్‌టీ శస్త్రచికిత్సల ప్రాముఖ్యతను ఈ కేసు మరోసారి చాటిచెప్పింది.
- మాటల, భాషా మరియు భవిష్యత్ అభివృద్ధిలో ఇటువంటి చికిత్సలు కీలక పాత్ర పోషిస్తాయి.

**యశోద ఆసుపత్రి యాజమాన్యం స్పందన:**

ఈ కేసు యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న ఆధునిక ఈఎన్‌టీ వైద్య సేవలు, నిపుణుల శస్త్రచికిత్స నైపుణ్యం, రోగికేంద్రిత వైద్య విధానానికి నిదర్శనమని యాజమాన్యం పేర్కొంది. క్లిష్టమైన పిల్లల వినికిడి సమస్యలను కూడా అత్యున్నత ప్రమాణాలతో చికిత్స చేసే సామర్థ్యం ఆసుపత్రి ప్రత్యేకతగా వెల్లడించింది. అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, ఆధునిక నిర్ధారణ సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్య నిపుణుల సమన్వయం ఈ విజయానికి కారణమని తెలిపింది. మలక్‌పేట్ యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర మాట్లాడుతూ, అత్యాధునిక సాంకేతికతతో పాటు నిపుణుల బృందం సహకారంతో పిల్లల్లో వినికిడి లోపాలను సమర్థవంతంగా చికిత్స చేస్తున్నామని తెలిపారు. ముందస్తు చికిత్స ద్వారా పిల్లల భవిష్యత్ అభివృద్ధిని మెరుగుపరచడం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

## గంజాయి నిర్మూలనలో ప్రజల సహకారం అవసరం

**పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి .. డి-అడిక్షన్ సెంటర్‌ను సందర్శించిన డీసీపీ**



**విశాల భారతి గోదావరిఖని:** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్‌లో గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలకు బానిసలైన వారిలో మార్పు తీసుకురావడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన డిఅడిక్షన్ సెంటర్‌ను పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి సందర్శించారు. గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డిఅడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న యువకులతో డీసీపీ మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి,చికిత్స విధానం గురించి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ,మత్తు పదార్థాలకు బానిసలైన వారిని గుర్తించి నార్కోటిక్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, పరీక్షల్లో పాజిటివ్‌గా తేలిన వారిని న్యాయస్థానం ఆదేశాల మేరకు 15 రోజుల పాటు డిఅడిక్షన్ సెంటర్‌కు పంపిస్తున్నామని తెలిపారు.అక్కడ వారికి వైద్య చికిత్సతో పాటు మానసికంగా మార్పు తీసుకురావడానికి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గంజాయి సరఫరా చేసే వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, అలాగే గంజాయి సేవించే వారిని గుర్తించి వారిని ఆ అలవాటు నుంచి దూరం చేస్తే సరఫరా కూడా తగ్గే అవకాశముందని డీసీపీ అన్నారు. తల్లిదండ్రులు, పెద్దలు తమ పరిసరాల్లో ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నా లేదా సేవిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.పోలీసులు స్పందించి నిందితులపై కేసులు నమోదు చేసి నార్కోటిక్ పరీక్షలు నిర్వహిస్తారని, పాజిటివ్‌గా తేలిన వారిని డిఅడిక్షన్ సెంటర్లకు పంపించి చికిత్స అందిస్తామని తెలిపారు. నిపుణులైన వైద్యుల సహాయంతో మత్తు బారిన పడిన వ్యక్తులు తిరిగి సాధారణ జీవితంలోకి వచ్చే అవకాశం ఉందని, డ్రగ్స్ రహిత పెద్దపల్లి జిల్లాను నిర్మించడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని డీసీపీ రామ్ రెడ్డి కోరారు.ఈగల్ డైరెక్టర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, నార్కోటిక్ పెద్దపల్లి ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర రావు,వైద్య అధికారులు,సిబ్బంది, గంజాయికి బానిసై డిఅడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న వారితో కలిసి గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా మొక్కలు నాటారు.

## ఎల్లమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

**మాజీ మంత్రి సత్యవతి రాథోడ్.. తండా సమస్యలపై అధికారులతో ఫోన్**



**కురవి విశాలభారతి:** డోర్నకల్ నియోజకవర్గంలోని కాకులబోడు తండా గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని మాజీ మంత్రివర్యులు శ్రీమతి సత్యవతి రాథోడ్ బుధవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి మొక్కులు చెల్లించి గ్రామ ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు తమ ప్రాంతంలోని పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా కాకులబోడు తండా నుండి చిన్నగూడూరు మండల కేంద్రానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన రెండు కిలోమీటర్ల లింక్ రోడ్డు పనులు ఇప్పటికీ పూర్తికాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దీనిపై స్పందించిన సత్యవతి రాథోడ్, ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం బాధాకరమని విమర్శించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంజూరైన పనులను సకాలంలో పూర్తి చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. వెంటనే ట్రైబల్ వెల్ఫేర్ సీఈ చీఫ్ ఇంజనీర్ బాలు నాయక్‌తో ఫోన్‌లో మాట్లాడి, రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అదేవిధంగా గ్రామంలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటినా గ్రామాలకు తాగునీటిని సక్రమంగా అందించలేకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. ఈ సమస్యపై కురవి మండల ఎంపీడీవో వీరబాబుతో ఫోన్‌లో మాట్లాడి, మిషన్ భగీరథ నీరు వెంటనే ప్రతి ఇంటికి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అభివృద్ధి పనులను మధ్యలోనే నిలిపివేయడం సరైన విధానం కాదని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం తాను నిరంతరం పోరాడుతూనే ఉంటానని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బానోత్ మాల్సూర్, ఐలి నరహరి గౌడ్, బోడ శ్రీను నాయక్, గుగులోత్ నెహ్రూ నాయక్, బాదే నాగయ్య, ఉప సర్పంచ్ గుగులోత్ శ్రీలత, గుగులోత్ సురేష్, బానోత్ బిక్షపతి, గుగులోత్ వీరన్న, భూక్య శ్రీధర్, బానోత్ బాబురావు, బానోత్ యాకు, బానోత్ రమేష్, సురేష్ తదితర బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నివాళులు అర్పించిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



**మరిపెడ విశాలభారతి:** డోర్నకల్ నియోజకవర్గంలోని మరిపెడ మండలం గుర్రాపు తండా గ్రామపంచాయతీ పరిధిలోని మంజ్య తండ గ్రామంలో ఇటీవల మరణించిన మాలోతు రాంకోటి చిత్రపటానికి మాజీ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె రాంకోటి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మాలోతు రాంకోటి సమాజానికి చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన మరణం కుటుంబ సభ్యులకు, గ్రామ ప్రజలకు తీరని లోటని సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, పార్టీ తరపున ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ నివాళి కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఐలి నరహరి గౌడ్, బొడ శ్రీను, గుగులోత్ నెహ్రూనాయక్, బాధే నాగయ్య, హలవత్ శంకర్ నాయక్, ఎడ్జెర్ల గ్రామ శాఖ అధ్యక్షులు గడ్డం శ్రీను, ఎల్‌హెచ్‌పీఎస్ భూక్యా రామ్మూర్తి నాయక్, మాలోత్ నరేష్, మంజా నాయక్, బలరాం నాయక్, జగన్, మంజ్య బిక్కు నాయక్, భూక్యా కిస్టు నాయక్, మాలోత్ వెంకన్న నాయక్, రఘుపతి, హలవత్ రాములు తదితరులు పాల్గొని మాలోతు రాంకోటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై మాలోతు రాంకోటి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమం గంభీర వాతావరణంలో నిర్వహించబడింది.

## ఆరోగ్య శాఖాధికారి ఆకస్మిక తనిఖీలు

**సేవల మెరుగుదలకు పలు కీలక ఆదేశాలు.. డా. తుకారాం రాథోడ్**

**విశాలభారతి:** సోములగూడెం ఉపకేంద్రం సందర్శన సమయంలో ఉపకేంద్రం తాళం వేసి ఉండటం గమనించారు. సంబంధిత ఏఎన్ఎంలు ఓల్డ్ సూరారం గ్రామంలో టీకాకరణ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు తెలిసింది. ఉపకేంద్రం మూసివేయబడిన విషయంపై ఆగ్రహం వ్యక్తం చేసిన డీఎంహెచ్‌వో, సంబంధిత డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్/వైద్యాధికారికి మెమో జారీ చేయాలని ఆదేశించారు. అనంతరం ఇందిరా కాలనీ ఉపకేంద్రాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో, రోగులకు స్వయంగా రక్తపోటు పరీక్షలు నిర్వహించి ఆరోగ్య అవగాహన కల్పించారు. అలాగే బరువు కొలిచే యంత్రం పనిచేయకపోవడాన్ని గమనించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. అక్కడ నిర్వహిస్తున్న టీకాకరణ కార్యక్రమాన్ని పరిశీలించి, డ్యూ లిస్ట్ రిజిస్టర్లు, వ్యాక్సిన్ క్యారియర్, వ్యాక్సిన్ లాజిస్టిక్స్ మరియు ఇతర రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి అవసరమైన సూచనలు అందజేశారు. తదుపరి భద్రాచలం యాంటీ యాస్ యూనిట్ /యాంటీ మలేరియా యూనిట్‌ను సందర్శించి, ఇటీవల బదిలీపై వచ్చిన సూపర్‌వైజర్‌కు విధుల నిర్వహణపై మార్గనిర్దేశం చేశారు. అనంతరం మలేరియా స్టోర్‌రూమ్‌ను పరిశీలించి, సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు సన్నాహక చర్యల్లో భాగంగా ఫాగింగ్ యంత్రాలను మరమ్మతులు చేయించి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే ఎంపీహెచ్ఈఓ శ్రీ గోండి వెంకటేశ్వర్లుకు అదనపు ఏఎంఓ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డా. శ్రీధర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, భద్రాచలం,డా. ప్రతాప్, జిల్లా శిశు ఆరోగ్య మరియు టీకాకరణ అధికారి, శ్రీ మోహన్, డీపీఎంఓ,శ్రీ పాయం శ్రీను డీపీఎంఓ, శ్రీ గోండి వెంకటేశ్వర్లు ఎంపీహెచ్ఈఓ,మరియు సిబ్బంది పాల్గొన్నారు.




## నకిలీ విత్తనాలు, ఎరువులను వ్యతిరేకిద్దాం

**ఏఐకేఎంఎస్ కురవి మండల 6వ మహాసభలో పిలుపు**




**కురవి విశాలభారతి:** దేశంలో, రాష్ట్రంలో రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్న నకిలీ విత్తనాలు, ఎరువుల వ్యాపారాన్ని అరికట్టేందుకు రైతాంగం ఐక్యంగా ఉద్యమించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జు దేవేందర్ పిలుపునిచ్చారు. కొరవి మండలం బలపాల గ్రామంలో అమరుడు కామ్రేడ్ ఆలన్న స్మారకంగా నిర్వహించిన ఏఐకేఎంఎస్ కొరవి మండల 6వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తొలకరి వర్షాలు కురవడంతో రైతులు సాగు పనులకు సిద్ధమవుతున్న తరుణంలో వారికి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. నకిలీ విత్తనాలు, ఎరువులను తయారు చేసి విక్రయిస్తున్న కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా రైతులు భారీ నష్టాలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు అవసరమైన వ్యవసాయ ఇన్‌పుట్‌లు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉచితంగా విత్తనాలు అందించాలని, బీసీ రైతులకు సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేయాలని సంఘం తరపున ఎన్నో ఉద్యమాలు చేపట్టినా ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న ప్రభుత్వాలపై ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మహాసభ ప్రారంభోపన్యాసం చేసిన సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కొరవి సబ్ డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ సామ పాపయ్య మాట్లాడుతూ, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని గట్టెక్కించాలంటే రైతు పంటలకు చట్టబద్ధమైన గిట్టుబాటు ధర హామీ ఇవ్వాలని, అందుకోసం రైతాంగం సంఘటిత పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం కొరవి మండల ఏఐకేఎంఎస్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కోడి నరసయ్య, ఉపాధ్యక్షుడిగా గూగులోతు కోబాల్, సహాయ కార్యదర్శిగా బానోత్ హాప్లా, కోశాధికారిగా మాలోత్ వీరన్న ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా గండు కృష్ణ, హర్జా నరేష్, రాము, వెంకన్న, చాట్ల నారాయణలను ఎన్నుకున్నారు. ఈ మహాసభలో లాలు రమేష్, వినోద్, రవి, కాంతమ్మ, కేస్లీ సక్రమ్ తదితర నాయకులతో పాటు సుమారు 60 మంది రైతులు పాల్గొన్నారు. మహాసభలో రైతుల సమస్యలు, నకిలీ విత్తనాలు ఎరువుల నియంత్రణ, గిట్టుబాటు ధరల సాధన వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. రైతుల హక్కుల సాధన కోసం భవిష్యత్తులో మరింత బలమైన ఉద్యమాలు చేపట్టాలని సభ తీర్మానించింది.

## ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడాలి

**మేయర్ మహంకాళి స్వామి**

**విశాలభారతి గోదావరిఖని:**

ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో 10,11, 39, 40. 41,42,43,52,53,54,55,56,57, 58 డివిజన్లకు సంబంధించిన క్లస్టర్ లెవెల్ వార్డు సభ రాజస్థాన్ భవన్ , కళ్యాణ్ నగర్ లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్న బియ్యం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు ,సబ్సిడీ గ్యాస్ వంటి అనేక సంక్షేమ పథకాలను పేద వాళ్ళ కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విషయం గ్రహించాలని అన్నారు. ఎం.ఎల్ ఏ ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ ఆధ్వర్యంలో రామగుండంలో జరుగుతున్న అభివృద్ధి చూసి పది మందికి చెప్పాలని అన్నారు.



నిరంతరం రామగుండం నగర అభివృద్ధి ని తలుస్తూ నిధుల కోసం మంత్రులను కలుస్తూనే ఉన్నారని అన్నారు. కేవలం రెండేళ్ల కాలంలో నే వెయ్యి కోట్ల అభివృద్ధి చేసారని అన్నారు.రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందుగానే కాలువ పూడిక తీత పనులను నిర్వహిస్తున్నామని అన్నారు. వైద్య, ఆరోగ్య, పోలీస్ , మునిసిపల్ తదితర విభాగాల అధికారులు చేసిన సూచనలను పాటిస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. నగరాన్ని స్వచ్ఛ రామగుండంగా తీర్చిదిద్దడానికి చేస్తున్న ప్రయత్నంల్ ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. నగరంలో కాలుష్యాన్ని ఎదుర్కోవడానికి విరివిగా మొక్కలు పెంచాలని అన్నారు.భూ గర్భ జల మట్టాలు పెరగడానికి ఇంకుడు గుంతలు తవ్వాలని అన్నారు.నగర అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తామని అన్నారు. తమ పిల్లలు ఆన్ లైన్ బెట్టింగులు,గంజాయి తీసుకోవడం వంటి వ్యసనాల బారిన పడకుండా తల్లితండ్రులు జాగ్రత్త వహించాలని అన్నారు. డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక రామగుండంలో దిగ్విజయంగా నిర్వహించడం జరుగుతున్నదని అన్నారు.ఎం ఎల్ ఏ ఆదేశాల మేరకు మేయర్ ఆధ్వర్యంలో ఉదయం ఆరు గంటలకే డివిజన్ లో తిరుగుతూ శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తుండడం సత్ఫాలితాలు ఇస్తున్నదని అన్నారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు ),రామగుండం నగర పాలక సంస్థ కమీషనర్ జె.అరుణశ్రీ మాట్లాడుతూ వర్షాకాలంలో ఎలాంటి విపత్తులు రాకుండా అన్ని విభాగాల సమన్వయంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతున్నదని అన్నారు.వేలాడుతున్న విద్యుత్ తీగలు, శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాల గురించి తగు చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేస్తామని అన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ నిబంధనలు పాటించి చెత్తను విభజించి ఇవ్వాలని అన్నారు. కాగా ఈ సందర్భంగా సర్ పై ఎం ఆర్ ఓ రవీందర్ వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ తీసుకుంటున్న చర్యలు, హెచ్ పి వి వ్యాక్సిన్ వేసుకోవడం గురించి అడ్డగుంటపల్లి మెడికల్ ఆఫీసర్ స్నేహ లత వివరించారు. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు నివారించడంపై ట్రాన్స్ కో ఎ ఇ జమీల్ పాషా అవగాహన కల్పించారు. అరైవ్ అలైవ్ కార్యక్రమం , ట్రాఫిక్ నిబంధనల గురించి ట్రాఫిక్ సి ఐ రాజేశ్వర్ రావు వివరించారు. శాంతి భద్రతలు ,వివిధ రకాల నేరాలు, సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వన్ టౌన్ సి ఐ ఇంద్రసేనా రెడ్డి వివరించారు.

## నిద్రలో ఉన్న యువకుడిని తీసుకెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు..!

**హయత్‌నగర్‌లో మిస్టరీ మిస్సింగ్ కేసు నమోదు – యువకుడి ఆచూకీ కోసం పోలీసుల గాలింపు**



**విశాల భారతి , అబ్దుల్లాపూర్ మెట్ :** హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు అనుమానాస్పదంగా అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. ఇంట్లో నిద్రిస్తున్న యువకుడిని ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కుంట్లూర్ గ్రామంలోని ఇష్టకామేశ్వరి కాలనీకి చెందిన ఎద్మల్ల అశోక్ (48) ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదుదారుడి కుమారుడు బాలవేణు (20) జెప్టోలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. జూన్ 10వ తేదీ ఉదయం సుమారు 6:30 గంటల సమయంలో బాలవేణు ఇంట్లో నిద్రిస్తుండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అతడిని వెంట తీసుకెళ్లినట్లు అతని సోదరి నిక్షిత కుటుంబ సభ్యులకు తెలిపింది. ఆ సమయంలో అశోక్ వాకింగ్‌కు వెళ్లగా, అతని భార్య విధుల నిమిత్తం జీహెచ్ఎంసీ పనులకు వెళ్లినట్లు సమాచారం.అనంతరం కుటుంబ సభ్యులు బాలవేణు మొబైల్ ఫోన్‌కు పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ స్పందన రాకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. బంధువులు, స్నేహితుల వద్ద గాలించినా ఆచూకీ లభించకపోవడంతో హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు క్రైం నంబర్ 995/2026 కింద వ్యక్తి అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపారు. యువకుడి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయని, సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నామని చెప్పారు. యువకుడి గురించి ఏవైనా వివరాలు తెలిసిన వారు వెంటనే హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు. కేసుకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ వెల్లడించారు.

## మోదీ దీర్ఘాయుష్షు కోసం ప్రత్యేక పూజలు

**శారదనగర్ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం – పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**



**విశాల భారతి , అబ్దుల్లాపూర్ మెట్ :** భారతీయ జనతా పార్టీ అధిష్టానం పిలుపు మేరకు, వరుసగా మూడోసారి దేశ ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తూ 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దీర్ఘాయుష్షు, ఆయురారోగ్యాలు మరియు దేశ సేవ మరింత కాలం కొనసాగాలని ఆకాంక్షిస్తూ ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శారదనగర్ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు, సామూహిక హనుమాన్ చాలీసా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, సనాతన ధర్మ పరిరక్షణ కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. భారతదేశం ప్రపంచ వేదికపై మరింత ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని ఆకాంక్షించారు.దేశం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని, భారతదేశం విశ్వగురువుగా మరింత కీర్తి ప్రతిష్ఠలు సాధించాలని పంచముఖ ఆంజనేయ స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయురారోగ్యాలతో దేశానికి మరింతకాలం సేవలందించాలని కోరుతూ నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య సాగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉగాది ఎల్లప్ప, హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవిందాచారి, నాయకులు అప్పారావు, ఇట్టబోయిన నర్సింహ, మధుసూదన్ రెడ్డి, సురేష్ రెడ్డి, మహిళా నాయకురాలు పార్వతి, డివిజన్ అధ్యక్షురాలు గీత, నాయకురాలు మంజు, ఇతర నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సురంగల్ స్మశాన వాటికకు పునర్జీవం

**కౌన్సిలర్ కర్రోల్ల శ్రీధర్ చొరవతో భారీ స్థాయిలో పరిశుభ్రత పనులు**

**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు సురంగల్ స్మశాన వాటికకు కౌన్సిలర్ కర్రోల్ల శ్రీధర్ చొరవతో పునర్జీవం లభించింది. 99 రోజుల ప్రత్యేక పారిశుద్ధ్య ప్రణాళికలో భాగంగా జేసీబీలు, డోజర్ల సహాయంతో స్మశాన వాటికలో పేరుకుపోయిన చెత్తను పూర్తిస్థాయిలో తొలగించి పరిశుభ్రత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కర్రోల్ల శ్రీధర్ మాట్లాడుతూ, గత అనేక సంవత్సరాలుగా స్మశాన వాటిక ఆవరణలో స్థానికులు డంపింగ్ చెత్తను వేయడం వల్ల ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారి తీవ్ర దుర్వాసన వెదజల్లేదని తెలిపారు. దీంతో పర్యావరణం దెబ్బతినడంతో పాటు అంత్యక్రియల కోసం వచ్చే కుటుంబ సభ్యులు, బంధువులు సమాధుల వద్దకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. అంతేకాకుండా, సమాధుల కోసం గొయ్యిలు తవ్వే కార్మికులు కూడా అక్కడ పని చేయడానికి ఇబ్బందులు ఎదుర్కొనేవారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను గుర్తించిన మున్సిపల్ చైర్మన్ సూచనల మేరకు జేసీబీలు, ట్రాక్టర్లు, డోజర్లను వినియోగించి టన్నుల కొద్దీ పేరుకుపోయిన చెత్తను తొలగించి భూమిని చదును చేసి స్మశాన వాటికను పూర్తిగా శుభ్రం చేశామని తెలిపారు. ప్రజల మనోభావాలతో ముడిపడిన స్మశాన వాటికలను పరిశుభ్రంగా ఉంచడం తమ బాధ్యత అని పేర్కొన్న ఆయన, ఇకపై ఈ ప్రాంతంలో చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్మశాన వాటికను నిరంతరం పర్యవేక్షిస్తూ పరిశుభ్రతను కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.స్మశాన వాటికను శుభ్రపరచడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ కౌన్సిలర్ కర్రోల్ల శ్రీధర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ చర్యతో సురంగల్ స్మశాన వాటికకు కొత్త రూపు వచ్చినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

# పల్లె కథల పెద్దాయన ఇక లేరు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

దక్షిణాది సినీ యవనికపై ఒక ధ్రువతార రాలి పోయింది. గ్రామీణ సౌందర్యాన్ని, సహజ సిద్ధమైన భావోద్వేగాలను వెండితెరపై ఆవిష్కరించి, నాలుగు దశాబ్దాల పాటు కోట్లాది మంది ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసిన అపర మేధావి, ప్రముఖ దర్శకుడు, నటుడు భారతీరాజా కన్నుమూశారు. ఎనభై ఆరు ఏళ్ల వయసులో ఆయన తుదిశ్వాస విడవడం భారతీయ చలనచిత్ర పరిశ్రమకు తీరని లోటుగా మారింది. గత కొంత కాలంగా వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న ఆయన, చెన్నైలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. ఆయన మరణవార్త తెలియగానే తమిళనాడుతో పాటు తెలుగు రాష్ట్రాల్లోని సినీ ప్రముఖులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఒక గొప్ప కళాకారుడు భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన సృష్టించిన అద్భుతమైన దృశ్యకావ్యాలు చిరకాలం సజీవంగా ఉంటాయి. వెయ్యికి పైగా నటీనటులు, సాంకేతిక నిపుణులను సినీ రంగానికి పరిచయం చేసిన ఘనత ఆయన సొంతం. పందొమ్మిది వందల డెబ్బై ఏడులో విడుదలైన పదహారేళ్ల వయసు చిత్రంతో దర్శకుడిగా అడుగుపెట్టిన ఆయన, తొలి ప్రయత్నంలోనే సంచలనం సృష్టించారు. అప్పటివరకు ఉన్న కమర్షియల్ ఫార్ములాను పక్కనపెట్టి, పల్లెటూరి మట్టి వాసనను, మనుషుల మధ్య ఉండే స్వచ్ఛమైన బంధాలను తెరపై చూపించడం అప్పట్లో ఒక విప్లవం. ఆ చిత్రం దాదాపు మూడు వందల రోజుల పాటు విజయవంతంగా ప్రదర్శితమై రికార్డు సృష్టించింది. కేవలం సాంకేతిక విలువలకే పరిమితం కాకుండా, కథలోని ఆత్మను పట్టుకోవడంలో ఆయన చూపిన ప్రతిభ అమోఘం. ఆ తర్వాత వచ్చిన చిత్రాలు సైతం దశాబ్దాల కాలం గడిచినా నేటికీ క్లాసిక్స్‌గా నిలుస్తూ ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నాయి. తెలుగు సినీ ప్రేక్షకులకు భారతీరాజా ఒక ఆత్మీయుడు. ఆయన దర్శకత్వంలో వచ్చిన సీతాకోకచిలుక, ఆరాధన వంటి చిత్రాలు తెలుగు చలనచిత్ర చరిత్రలో ప్రత్యేక అధ్యాయాలుగా నిలిచిపోయాయి. భాషతో సంబంధం లేకుండా మనుషుల భావాలు ఒకటేనని ఆయన తన సినిమాల ద్వారా నిరూపించారు. యాభైకి పైగా సినిమాలను విభిన్న శైలుల్లో తెరకెక్కించిన ఆయన, ప్రతి చిత్రంలోనూ ఏదో ఒక కొత్త కోణాన్ని ఆవిష్కరించారు. ఎర్ర గులాబీలు, జమదగ్ని, కొత్త జీవితాలు వంటి చిత్రాలు నేటికీ ఎంతో మంది దర్శకులకు పాఠాలుగా మారుతున్నాయి. ప్రేక్షకుల నాడిని పట్టుకోవడంలో, వారిని భావోద్వేగాల ప్రవాహంలో ముంచెత్తడంలో భారతీరాజాకు ఆయనే సాటి. తెలుగు, తమిళ భాషల మధ్య వారధిగా నిలిచి, రెండు పరిశ్రమలను తనదైన శైలిలో ప్రభావితం చేసిన గొప్ప వ్యక్తిత్వం ఆయనది. నటనారంగంలో కూడా ఆయన తనదైన ముద్ర వేశారు. కేవలం కెమెరా వెనుక ఉండి దర్శకత్వం వహించడమే కాకుండా, కెమెరా ముందు నటుడిగా కూడా ఆయన అద్భుతాలు చేశారు. అనేక తమిళ చిత్రాల్లో ఆయన పోషించిన పాత్రలు విమర్శకుల ప్రశంసలను అందుకున్నాయి. చివరిగా ఆయన నటించిన చిత్రాలు ఆయనలోని నటుడిని మరో మెట్టు పైకి తీసుకెళ్లాయి. దర్శకుడిగా మీండుం ఒరు మరియాదై చిత్రంతో ముగింపు పలికినప్పటికీ, నటుడిగా మాత్రం ఆయన నిరంతరం బిజీగానే ఉండేవారు. ఒక కళాకారుడిగా ఆయన ప్రయాణం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం. తను నమ్మిన కథల కోసం, పాత్రల కోసం ఆయన పడిన తపన ప్రతిభావంతుడైన ఒక దర్శకుడికి ఉండాల్సిన అంకితభావానికి నిదర్శనం. ఆయన వ్యక్తిగత జీవితంలో గత ఏడాది సంభవించిన విషాదం, ఆయనను మానసికంగా చాలా బలహీనపరిచింది. తన కళ్లముందే ఏకైక కుమారుడు మనోజ్ భారతీ రాజా మరణించడం ఆయనను కోలుకోలేని దెబ్బ తీసింది. ఒక తండ్రికి అంతకంటే పెద్ద శిక్ష మరొకటి ఉండదని చెప్పవచ్చు. కుమారుడిని కోల్పోయిన బాధను దిగమింగుకుంటూ, ఆ విషాద సాగరం నుండి బయటపడటానికి ఆయన ప్రయత్నించారు. కొంతకాలం కుటుంబ సభ్యులతో విదేశాల్లో గడిపినప్పటికీ, మనసులో గూడు కట్టుకున్న ఆ వేదన ఆయన ఆరోగ్య పరిస్థితిని మరింత దిగజార్చింది. చెన్నైకి తిరిగి వచ్చిన తర్వాత కూడా ఆయన కోలుకోలేకపోయారనే వార్త ఆయన అభిమానులను కలచివేసింది. ఒక బలహీన సమయంలో కూడా ఆయన చూపిన స్థితప్రజ్ఞత అభినందనీయం. భారతీయ చలనచిత్ర రంగం ఒక గొప్ప మార్గదర్శకుడిని కోల్పోయింది. సుమారు నాలుగు దశాబ్దాల పాటు వెండితెరపై ఆయన సృష్టించిన మాయాజాలం మాటలకు అందనిది. ఎంతో మందికి జీవితాన్ని, కళను పరిచయం చేసిన గొప్ప గురువు ఆయన. ఆయన లేని లోటు చిత్ర పరిశ్రమకు ఎప్పటికీ తీరనిది. ఏ రంగంలోనైనా కొత్త పుంతలు తొక్కాలంటే ధైర్యం కావాలని ఆయన నిరూపించారు. ఆయన చూపిన బాటలోనే నేడు ఎంతో మంది యువ దర్శకులు ప్రయాణిస్తున్నారు. భారతీరాజా మరణం ఒక శకం ముగిసినట్లనిపిస్తుంది. ఆయన మరణించినప్పటికీ, ఆయన రూపొందించిన చిత్రాల ద్వారా ఆయన మన మధ్యే ఉంటారు. ఆయన మరణవార్త విన్న సినీ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి నాయకులు, సినీ నటులు, అభిమానులు ఆయనకు నివాళులు అర్పిస్తున్నారు. ఆయన మరణంపై స్పందిస్తూ, సినీ రంగంలో ఒక శూన్యం ఏర్పడిందని పేర్కొంటున్నారు. ఆయనతో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరూ ఆయన గొప్పతనాన్ని, ఆయన పని పట్ల ఉన్న నిబద్ధతను గుర్తు చేసుకుంటున్నారు. ఒక వ్యక్తిగా, దర్శకుడిగా, నటుడిగా ఆయన ప్రస్థానం అసాధారణం. ఎనభై ఆరు సంవత్సరాల జీవితంలో ఆయన సాధించిన విజయాలు, అందుకున్న అవార్డులు అన్నీ ఆయన కష్టానికి, ప్రతిభకు దక్కిన గుర్తింపు. సినిమా అంటే కేవలం వినోదం మాత్రమే కాదని, అది సమాజానికి ఒక ప్రతిబింబమని ఆయన నమ్మేవారు. తన చిత్రాల్లో పల్లెటూరి జీవితాన్ని, పేదరికాన్ని, బంధాలను ఎంత సహజంగా చూపించేవారో, మనుషుల మధ్య ఉన్న క్రూరత్వాన్ని, కుళ్లును కూడా అంతే ధైర్యంగా చూపే ధీశాలి ఆయన. ఆయన దర్శకత్వంలో నటించే అవకాశం కోసం ఎంతో మంది నటీనటులు ఎదురుచూసేవారు. ఆయన వద్ద శిక్షణ పొందిన వారు నేడు సినీ రంగంలో అగ్రశ్రేణిలో ఉండటం ఆయన దూరదృష్టికి నిదర్శనం. ఆయన ఒక విజ్ఞాన సర్వస్వం లాంటి వారు, ఆయనతో పనిచేసిన ప్రతి ఒక్కరూ ఏదో ఒక కొత్త విషయం నేర్చుకునేవారు. భారత ప్రభుత్వం ఆయన చేసిన సేవలను గుర్తించి పలు గౌరవ పురస్కారాలతో సత్కరించింది. ఆయన పొందిన పద్మశ్రీ అవార్డు ఆయన ప్రతిభకు, కళారంగానికి చేసిన సేవలకు దక్కిన గొప్ప గౌరవం. దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన అతికొద్ది మంది దర్శకుల్లో భారతీరాజా ఒకరు. కేవలం ప్రాదేశిక పరిమితులకు లోబడకుండా, ఆయన సినిమాలు అంతర్జాతీయ వేదికలపై కూడా ప్రదర్శితమయ్యాయి. తన జీవిత కాలంలో ఆయన దాదాపు అరవైకి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించి, ఎన్నో రికార్డులను తిరగరాశారు. ఆయన సినిమా ప్రస్థానం రాబోయే తరాలకు ఒక పాఠ్యపుస్తకంలా ఉపయోగపడుతుంది. కళామ్మ తల్లి ముద్దుబిడ్డ అయిన భారతీరాజాకు ఘన నివాళులు అర్పిస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుందాం. ఆయన లేని లోటు ఏ ఒక్కరికీ తీరదు. కానీ ఆయన అందించిన చిత్రాలు మనకు ఆయన జ్ఞాపకాలను నిరంతరం గుర్తు చేస్తూనే ఉంటాయి. ఆయన మరణంతో ఒక గొప్ప యుగం అంతమైంది. సినీ పరిశ్రమ ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటుంది. ఆయన చూపిన బాటలో మరి కొంతమంది ప్రతిభావంతులు నడుస్తారని ఆశిద్దాం. ఆయన జీవితం, ఆయన ప్రస్థానం వెండితెరపై ఎప్పటికీ ఒక అద్భుతమైన చరిత్రగా నిలిచిపోతాయి. ఆయన చూపిన వెలుగులు ఎప్పటికీ ఆరిపోవు.

## నేడు కళ్యాణ లక్ష్మి – షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**అర్హులైన లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలి**

**: మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బింగి దేవదాస్ గౌడ్**



**విశాల భారతి : అబ్దుల్లాపూర్‌మెట్ :** అబ్దుల్లాపూర్‌మెట్ మండలానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కుల పంపిణీ కార్యక్రమం నేడు తేది 11నా గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు అబ్దుల్లాపూర్‌మెట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బింగి దేవదాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా దేవా దాస్ మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద అంబర్‌పేట్ ఔటర్ రింగ్ రోడ్ సమీపంలోని తారా కన్వెన్షన్‌లో ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం జరగనున్నదని పేర్కొన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలానికి చెందిన సుమారు 400 మంది లబ్ధిదారులకు రూ.4 కోట్ల 46 లక్షల 400 విలువైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని బింగి దేవదాస్ గౌడ్ అన్నారు. ఈ పథకాల ద్వారా నిరుపేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ప్రభుత్వం చేయూతనందించడం అభినందనీయమని పేర్కొన్నారు.అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, మీడియా ప్రతినిధులు మరియు అర్హులైన లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ముఖ్యంగా చెక్కులు మంజూరైన లబ్ధిదారులు తప్పనిసరిగా హాజరై తమ చెక్కులను స్వీకరించుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బింగి దేవదాస్ గౌడ్ కోరారు.

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీపై కఠిన చర్యలు తీసుకోవాలి

- **జీవో నెం.7ను వెంటనే రద్దు చేయాలి**
- **ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు రూ.10 వేల కోట్లు విడుదల చేయాలి**
- **మాస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పెద్దవూర బ్రహ్మయ్య**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ప్రైవేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని, జీవో నెం.7ను వెంటనే రద్దు చేయడంతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుల కోసం రూ.10 వేల కోట్లు తక్షణమే విడుదల చేయాలని మాస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పెద్దవూర బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన మౌలిక వసతులు లేకపోవడంతో తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.విద్యారంగాన్ని వ్యాపారంగా మార్చి అధిక ఫీజులతో తల్లిదండ్రులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే జూన్ నెలలో స్కూల్ ఫీజులు, పుస్తకాలు, బ్యాగులు, షూస్, యూనిఫాంలు తదితర ఖర్చులతో తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను తీర్చడంతో పాటు తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, డిజిటల్ విద్యా సదుపాయాలు, ఆధునిక మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రభుత్వ విద్యను మరింత పటిష్టం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని, లేకపోతే రానున్న రోజుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని పెద్దవూర బ్రహ్మయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## ప్రాణాలతో గమ్యానికి చేరుకోండి

- **మీ కుటుంబం మీ కోసం ఎదురుచూస్తోంది**
- **అరైవ్ అలైవ్' రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం.. పోలీస్ కమిషనర్ సుమతి ఐపీఎస్**



**విశాలభారతి , అబ్దుల్లాపూర్ మెట్ :** హయత్‌నగర్ అంబేద్కర్ విగ్రహం పక్కన బస్ స్టాండ్ సమీపంలో "అరైవ్ అలైవ్ - మీ కుటుంబం మీ కోసం వేచి ఉంది" అనే సందేశంతో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్‌మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ సుమతి మాట్లాడుతూ.. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి ఉమ్మడి బాధ్యత అని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగం తప్పనిసరి అని, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలు ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు. ప్రాణాలతో గమ్యానికి చేరుకోండి - మీ కుటుంబం మీ కోసం ఎదురుచూస్తోంది అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం అధికారులు ప్రజలకు రోడ్డు భద్రతపై కరపత్రాలు పంపిణీ చేసి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్ డీసీపీ అనురాధ ఐపీఎస్, అదనపు డీసీపీ కోటేశ్వరరావు, వనస్థలిపురం ఏసీపీ కాశీనాథ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. లక్ష్మీ ప్రసన్న, రోడ్ సేఫ్టీ ఆఫీసర్ మనోహర్, టీజీఎస్ఆర్టీసీ హయత్‌నగర్ డీఎం విజయ్, హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్, క్రైమ్ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్, మాజీ కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్ రెడ్డి, ఆర్ అండ్ బి శాఖ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, రోడ్డు ప్రమాద బాధిత కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మి నారాయణ, వెంకట్ రెడ్డి, నర్సింహా, భాగ్యలక్ష్మి,పోలీస్ సిబ్బంది, ట్రాఫిక్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువత మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## ప్రజల సమస్యలపై బిఆర్ఎస్ నాయకుల ఆందోళన

- **త్రాగునీరు, రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలు, శానిటైజింగ్**
- **సమస్యలను తక్షణమే పరిష్కరించాలి**
- **రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ప్రజా సమస్యలపై ఉద్యమిస్తాం**
- **బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలోనే పట్టణ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి**
- **బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వనమా రాఘవేందర్**



**పాల్వంచ, విశాలభారతి:** కొత్తగూడెం కార్పొరేషన్ పాల్వంచ డివిజన్ పరిధిలో ఉన్నటువంటి వివిధ రకాల ప్రజా సమస్యలపై బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వనమా రాఘవేందర్, మరియు,బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కిలారు నాగేశ్వరరావు, కనగాల బాలకృష్ణ,ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కొరకు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున ర్యాలీగా బయల్దేరి ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేస్తూ స్లొగన్స్ ఇస్తూ మున్సిపాలిటీ ఆఫీస్ వద్దకు చేరుకొని బైఠాయించారు, కార్యక్రమాన్ని ఉద్దేశించి,బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వనమా రాఘవేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అనే నినాదంతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాక ప్రజలను ప్రజా సమస్యలను తుంగలోకి తొక్కి కనీస వసతులు కల్పించలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. ప్రజలకు కనీస అవసరాలు అయినటువంటి త్రాగునీరు, రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలు, శానిటైజింగ్, మరియు ఇతర చిన్న సమస్యలను, కూడా, తీర్చలే పోతుందని, విమర్శించారు.బిఆర్ఎస్ ప్రభుత్వంలో కొత్తగూడెం నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వ పేరుకే కార్పొరేషన్ చేసిందని మరి డివిజన్ల వారీగా తక్షణమే నిధులు కేటాయించి ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసారు, లేదంటే రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు.కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ పాల్వంచ మండల అధ్యక్షులు మల్లెల శ్రీరామ్ మూర్తి,(39) వ డివిజన్ కార్పొరేటర్ గోవాడ గుణచరిత్, దాసరి నాగేశ్వరరావు, కాల్వ ప్రకాష్.పాత పాల్వంచ ఇన్చార్జ్ ముత్యాల ప్రవీణ్, కుంచెర్ల రామకృష్ణ. పట్టణ అధ్యక్షులు జూపెల్లి దుర్గాప్రసాద్, హర్షవర్ధన్, పత్తిపాటి శీను, రంజిత్, చింతలచెరువు దుర్గాప్రసాద్, చంద్రశేఖర్, యాదయ్య, వాసుమల్ల గౌతం,, కుంపటి శివ, కంచర్ల రామారావు, అనంత్, కిలారు చిన్న, వెట్టికోట సుధాకర్, తెలంగాణ సురేష్, మరియు, బండి అచ్చమ్మ, విజయ, లక్ష్మి, కృష్ణవేణి, సావిత్రి, జోష్ణ, మరియు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు

## బోయిన్‌పల్లి విద్యుత్ శాఖ 'డీఈ'గా జీ. శ్రీకాంత్

**కూకట్ పల్లి విశాలభారతి:** మేడ్చల్‌మల్కాజ్గిరి జిల్లా బోయిన్‌పల్లి విద్యుత్ శాఖ ఆపరేషన్స్ డివిజన్‌లో నూతన అధ్యాయం ప్రారంభమైంది. బోయిన్‌పల్లి విద్యుత్ శాఖ ఆపరేషన్స్ డివిజనల్ ఇంజనీర్ (డీఈ)గా జీ. శ్రీకాంత్ బుధవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ డీఈగా సేవలందించిన వి. గోపాల్ రావు పదవీ విరమణ చేయడంతో... ప్రస్తుతం సికింద్రాబాద్ డీపీఈ డీఈగా ఉన్న శ్రీకాంత్‌కు ఈ అదనపు బాధ్యతలను అప్పగించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో నూతన డీఈ శ్రీకాంత్ మాట్లాడారు. వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన సేవలు అందించడమే తమ తొలి ప్రాధాన్యతని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డీఈ శ్రీకాంత్ కీలక సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో ఉన్న లోటుపాట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ సరిదిద్దుతాం. డివిజన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో స్వయంగా పర్యటించి... ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేస్తాం. అవసరమైన చోట్ల కొత్త స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా కార్యాలయానికి చేరుకున్న నూతన డీఈ శ్రీకాంత్‌కు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఏడీఈలు సతీష్, హాక్, సూర్యప్రకాష్, నాగరాజు, ఏఈలు అక్బర్, వీణ, రాణి, మౌనిక, రాములు, అఖిల్ ఇతర సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.



## జీలుగు సాగుతో భూమికి బలం – రైతుకు లాభం

- **జీలుగు సాగుతో భూమి సారవంతం**
- **ఎరువుల ఖర్చు తగ్గించి దిగుబడులు పెంచే గ్రీన్ మ్యాన్యూర్**
- **50 శాతం రాయితీతో జీలుగు విత్తనాలు**
- **జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర**



**కురవి విశాలభారతి:**

రైతులు తమ పొలాల్లో జీలుగు (గ్రీన్ మ్యాన్యూర్) సాగు చేపట్టడం ద్వారా భూమి సారవంతం కావడంతో పాటు పంటల దిగుబడులు పెరిగి ఆర్థికంగా లాభపడతారని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. విజయ్ చంద్ర, ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. కురవి ఆంధ్ర బ్యాంకు సొసైటీలో రైతులకు జీలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పంట అవశేషాలను కాల్చివేయకుండా భూమిలోనే కలియదున్నాలని సూచించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో జీలుగు విత్తనాలను పొలాల్లో చల్లి, పూత దశకు చేరుకున్న తర్వాత వాటిని భూమిలో కలియదున్నడం వల్ల భూమికి సహజ ఎరువుల మాదిరిగా ఉపయోగపడుతుందని తెలిపారు. జీలుగు సాగు ద్వారా మొక్కలకు అవసరమైన నత్రజని, భాస్వరం, పొటాషియం, మ్యాంగనీస్, ఇనుము, కాల్షియం వంటి సూక్ష్మ పోషకాలు సమృద్ధిగా అందుతాయని చెప్పారు. దీంతో రసాయన ఎరువుల వినియోగం తగ్గి, ఎరువుల ఖర్చు తగ్గడంతో పాటు పంట దిగుబడులు పెరుగుతాయని వివరించారు. భూమి ఆరోగ్యం మెరుగుపడి దీర్ఘకాలికంగా రైతులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం జీలుగు విత్తనాలను 50 శాతం రాయితీతో అందిస్తున్నందున ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తప్పనిసరిగా విత్తనాలను తీసుకోవాలని వారు కోరారు. సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా భూమి సారాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. అనంతరం మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్. విజయ్ చంద్రను ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి, పెస్టిసైడ్స్ అసోసియేషన్ ప్రతినిధులు రఘుపతి, రవి, దామోదర్, ఉపేందర్ తదితరులు శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నరసింహారావు, బ్యాంకు ఎండీ, ఏఏవో రాజేశ్వరి, విజయేందర్, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కొండాపూర్ శ్రీరామ్‌నగర్‌లో బాబురావు అక్రమ నిర్మాణాల సామ్రాజ్యం

- **సెట్‌బ్యాక్‌లు గాలికి అదనపు అంతస్తుల పైపైకి**
- **ప్రభుత్వ ఖజానాకు రూ. కోట్ల గండి**
- **అధికారుల మౌనం విశాలభారతి వరుస కథనాలతో బట్టబయలు**

**శేరిలింగంపల్లి - విశాల భారతి**

ఐటీ కారిడార్ గుండెకాయ అయిన కొండాపూర్ శ్రీరామ్‌నగర్ ఏబీసీ బ్లాక్‌లలో బిల్డర్ బాబురావు అక్రమ నిర్మాణాలతో ప్రభుత్వ ఆదాయానికి వేలకోట్ల రూపాయల గండి కొడుతున్నారు. సెట్‌బ్యాక్‌లు వదలకుండా, శాంక్షన్ ప్లాన్‌కు మించి అదనపు అంతస్తులు నిర్మిస్తూ చట్టాలను బేఖాతరు చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ సిబ్బందిని బెదిరిస్తూ, ఉన్నతాధికారులను సైతం లెక్కచేయకుండా విచ్చలవిడిగా నిర్మాణాలు సాగిస్తున్న తీరుపై స్థానికుల ఆగ్రహం తారాస్థాయికి చేరింది.

**విశాలా భారతి వరుస కథనాలతో బట్టబయలు**

బాబురావు అఘాయిత్యాలపై విశాలా భారతి దిన పత్రిక వరుస కథనాలతో బండారం బయటపెట్టింది. శాంక్షన్ చేసిన ఫ్లోర్ ఏరియా రేషియో (ఎఫ్ఏఆర్) కంటే రెట్టింపు నిర్మాణాలు, పార్కింగ్ స్థలాలను పూర్తిగా ఆక్రమించి ఫ్లాట్లుగా మార్చడం, ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లు లేకుండా భవనాలు నిర్మించడం వంటి తీవ్ర ఉల్లంఘనలను విశాలా భారతి కథనాలు స్పష్టంగా వెల్లడించాయి. ఈ వరుస కథనాల నేపథ్యంలో బాబురావు అక్రమ నిర్మాణాల దందా మరింత బట్టబయలైంది.

**సెట్‌బ్యాక్‌లు లేవు, అదనపు అంతస్తులే**

శ్రీరామ్‌నగర్‌లో బాబురావు చేపడుతున్న నిర్మాణాల్లో సెట్‌బ్యాక్‌లు పాటించడం లేదు. ముందు, వెనుక, పక్కల వదలాల్సిన స్థలాన్ని పూర్తిగా ఆక్రమించి గోడకి గోడ అంటించి నిర్మాణాలు చేస్తున్నారు.



అనుమతులకు మించి నిర్మిస్తున్న అక్రమ నిర్మాణం

ఫలితంగా ప్రక్కనే ఉన్న భవనాలకు గాలి, వెలుతురు ఆగిపోయింది. అనుమతించిన అంతస్తులకు మించి 2 నుంచి 3 అదనపు ఫ్లోర్లు వేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఎలాంటి అనుమతులు లేకుండానే టాప్ ఫ్లోర్లను విక్రయాలు కూడా జరుపుతున్నారు.

**ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్ల గండి**

బాబురావు ఇలా అక్రమంగా కట్టిన ప్రతి చదరపు



నింగిని తాకేలా నిర్మిస్తున్న బాబురావు నిర్మాణం

అడుగుకు ప్రభుత్వానికి రావాల్సిన అనుమతి రుసుములు, డెవలప్‌మెంట్ ఛార్జీలు, కమ్యుటేషన్ ఫీజులు ఎగ్గొడుతున్నారు. శ్రీరామ్‌నగర్ ఏబీసీ బ్లాక్‌లలో ఆయన నిర్మించిన అక్రమ భవనాల విస్తీర్ణం లెక్కిస్తే ప్రభుత్వ ఆదాయానికి వేలకోట్ల రూపాయల నష్టం వాటిల్లినట్లు లెక్కలు చెబుతున్నాయి. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు కూడా తక్కువ చూపించి ప్రభుత్వాన్ని నష్టపరుస్తున్నారు.

**టౌన్ ప్లానింగ్ సెక్షన్ నిర్వీర్యం**

ఇంత జరుగుతున్నా శేరిలింగంపల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ సెక్షన్ పూర్తిగా నిర్వీర్యంగా మారింది. స్టాప్ మెమోలు ఇచ్చినా బాబురావు లెక్కచేయడం లేదు. డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్ స్థాయి అధికారులు ఉన్న సర్కిల్‌లోనే ఇంతటి అక్రమాలు జరుగుతున్నా ఎలాంటి కూల్చివేతలు, కేసులు లేకపోవడం అధికారుల పాత్రపై అనుమానాలకు తావిస్తోంది. పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలతో బాబురావును అధికారులే ప్రోత్సహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**ప్రజలకు తీవ్ర ఇబ్బందులు**

బాబురావు అక్రమ నిర్మాణాల వల్ల శ్రీరామ్‌నగర్‌లో డ్రైనేజీ లైన్లు మూసుకుపోయి వర్షాకాలంలో నీరు నిలుస్తోంది. పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో వీధులన్నీ వాహనాలతో నిండిపోయాయి. అగ్నిమాపక వాహనాలు, అంబులెన్స్‌లు కూడా లోపలికి రాలేని పరిస్థితి. ఇన్ని సమస్యలు ఉన్నా అధికారులు మాత్రం నిర్మల నీరు ఎత్తినట్లు చూస్తూ ఊరుకోవడం ప్రజలను రెచ్చగొడుతోంది.

**చర్యలు తీసుకోవాలని డిమాండ్**

విశాలా భారతి వరుస కథనాలతో వెలుగులోకి వచ్చిన బాబురావు అక్రమ నిర్మాణాలపై వెంటనే ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమంగా కట్టిన అదనపు అంతస్తులను కూల్చివేయాలని, బాధ్యులైన టౌన్ ప్లానింగ్ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ప్రభుత్వానికి నష్టం వాటిల్లించిన మొత్తాన్ని బాబురావు నుంచి రాబట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# వాటర్ లాగింగ్‌కు శాశ్వత పరిష్కారమే లక్ష్యం



హైడ్రా కమిషనర్ రంగనాథ్ తో కలిసి సైబరాబాద్ కమిషనర్ సిపి రమేష్ సమావేశం



జూమ్ మీటింగ్లో పోలీస్ అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న సిపి రమేష్

- **సైబరాబాద్ సీపీ ఆధ్వర్యంలో బహుళ శాఖల సమీక్ష**
- **53 పాయింట్లపై కసరత్తు**

**సైబరాబాద్ - విశాల భారతి**

రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సైబరాబాద్ పరిధిలోని వాటర్ లాగింగ్ పాయింట్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో బహుళ శాఖల సమీక్ష జరిగింది. బుధవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జూమ్ ద్వారా ఈ సమావేశం నిర్వహించారు. సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్, హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి సీఎంసీ కమిషనర్ సృజన, ట్రాఫిక్ అధికారులు,హైడ్రా,హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ, టీజీఎస్పీడీసీఎల్, టీజీఐఐసీ, ఇరిగేషన్, హెచ్‌జీసీఎల్, హెచ్ఎండీఏ, అర్బన్ ఫారెస్ట్ తదితర శాఖల ప్రతినిధులు ప్రత్యక్షంగా, వర్చువల్ విధానంలో పాల్గొన్నారు.వర్షాకాలంలో ప్రజల భద్రత, ట్రాఫిక్ నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ అధికారులకు సూచించారు. ప్రతి శాఖ తన బాధ్యతలను స్పష్టంగా నిర్వర్తించడంతో పాటు పరస్పర సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. వాటర్ లాగింగ్‌కు కారణమవుతున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు సంబంధిత శాఖలతో కలిసి నిరంతరం పర్యటించాలని ఆదేశించారు. సర్కిల్ వారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, అన్ని శాఖలు సమస్యాత్మక ప్రాంతాల మ్యాపింగ్ పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. భారీ వర్షాల సమయంలో ట్రాఫిక్ ఎక్కడా నిలిచిపోకుండా ప్రత్యామ్నాయ మార్గాలు, తక్షణ స్పందన చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట డ్రోన్లను వినియోగించి పరిస్థితులను పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలకు సమయానుకూల సమాచారం అందించేందుకు అన్ని శాఖలు ఉమ్మడి సోషల్ మీడియా వేదికలను సమర్థంగా ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. ఆకస్మిక విపత్తులు, అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు సర్కిల్, జోన్, కమిషనరేట్ స్థాయిల్లోని యంత్రాంగం ఒకే బృందంగా పనిచేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాల సందర్భంగా నగరంలో నీటి ప్రవాహం, వాటర్ లాగింగ్ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ముఖ్యంగా బయోడైవర్సిటీ జంక్షన్ సహా పలు ప్రాంతాలను సందర్శించి భారీ వర్షాల సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులను అధ్యయనం చేశామని చెప్పారు. సమస్యలు తలెత్తిన ప్రతి ప్రాంతాన్ని పరిశీలించి వాటికి మూలకారణాలను గుర్తించే దిశగా చర్యలు చేపడుతున్నామని వివరించారు. వర్షాకాల అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు హైడ్రా ప్రత్యేక ఎమర్జెన్సీ బృందాలను ఏర్పాటు చేసిందని, ప్రతి శాఖ నుంచి ఒక నోడల్ అధికారిని నియమించి సమస్యల పరిష్కారానికి సమన్వయ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. వర్షాకాలంలో నాల్లో పేరుకుపోయిన పూడిక, ఆక్రమణలు, నీటి పారుదల మార్గాల్లో ఉన్న అడ్డంకులు వాటర్ లాగింగ్‌కు ప్రధాన కారణాలని తెలిపారు.చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అవసరమైన చోట్ల నాల విస్తరణ, డ్రైనేజీ మెరుగుదల పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఫ్లైఓవర్ల కింద నీరు నిల్వ ఉండే ప్రాంతాలను ప్రత్యేకంగా గుర్తించి శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారిస్తున్నామని చెప్పారు.ఈ మొత్తం పరిస్థితిని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట వెంటనే స్పందించే విధంగా కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు. కమిషనరేట్ పరిధిలో గుర్తించిన ప్రతి వాటర్ లాగింగ్ పాయింట్‌కు ప్రత్యేక ఇన్‌చార్జ్ అధికారులను నియమించి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు సీఎంసీ కమిషనర్ సృజన తెలిపారు. మొత్తం 53 వాటర్ లాగింగ్ పాయింట్లలో కొన్ని ప్రాంతాల్లో చిన్నచిన్న మౌలిక సదుపాయాల పనులు చేపట్టడం ద్వారా మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉందని గుర్తించామని చెప్పారు. సమస్యల తీవ్రతను బట్టి ఆయా ప్రాంతాల్లో అవసరమైన చర్యలను ప్రాధాన్యత క్రమంలో అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. వర్షపు నీటి పారుదల సక్రమంగా జరిగేందుకు అవసరమైన చోట్ల పైపుల ఏర్పాటుతో పాటు, నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న ప్రాంతాల్లో కటింగ్ పనులు, ఇతర ఇంజినీరింగ్ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు.వాటర్ లాగింగ్ సమస్యల పరిష్కారానికి సంబంధించి వర్షాలకు ముందు, వర్షాల అనంతరం పరిస్థితులపై విజువల్ అనాలిస్ నిర్వహిస్తున్నట్లు సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ శేషాద్రి రెడ్డి వెల్లడించారు. వివిధ శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో సమస్యలను అధ్యయనం చేసి, శాశ్వత పరిష్కారాల కోసం కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రతి వాటర్ లాగింగ్ పాయింట్‌కు సంబంధించిన సమాచారాన్ని సేకరించి, సమస్యలకు దారితీస్తున్న మూలకారణాలను గుర్తించి చర్యలు చేపడుతున్నామని వివరించారు. సమావేశంలో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో గుర్తించిన మొత్తం 53 వాటర్ లాగింగ్ పాయింట్లపై సమీక్ష నిర్వహించారు. వీటిలో 42 ప్రాంతాల్లో ఇప్పటికే పరిష్కార చర్యలు పూర్తికాగా, మిగిలిన 17 పెండింగ్ పాయింట్లలో 15 ప్రాంతాలను అత్యంత కీలకమైన వాటర్ లాగింగ్ పాయింట్లుగా గుర్తించారు. గచ్చిబౌలి, మాదాపూర్, జీడిమెట్ల, కూకట్‌పల్లి, మియాపూర్, రాయదుర్గం, పటాన్‌చెరు తదితర ప్రాంతాల్లో వర్షాల సమయంలో ఎదురయ్యే సమస్యలపై శాఖల వారీగా చర్చించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ అధికారులు వాటర్ లాగింగ్ పాయింట్లకు సంబంధించిన సమగ్ర ప్రజెంటేషన్ ఇవ్వగా, వివిధ శాఖల ప్రతినిధులు ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన తాత్కాలిక, శాశ్వత పరిష్కార చర్యలను వివరించారు. వర్షాల సమయంలో ట్రాఫిక్ అంతరాయాలు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని, డ్రైనేజీ వ్యవస్థల మెరుగుదల, పంపుల ఏర్పాటు, నీటి పారుదల మార్గాల అభివృద్ధి, రోడ్ల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారించాలని సమావేశంలో నిర్ణయించారు.

## ప్రాణాల పరిరక్షణకు ట్రాఫిక్ శాఖ ముందడుగు

- **రోడ్డు నిబంధనలు పాటిద్దాం.. సురక్షితంగా ఇంటికి చేరుదాం**
- **ఎన్‌హెచ్-65పై రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం**




**విశాలభారతి , అబ్దుల్లాపూర్‌మెట్ :** రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలనే లక్ష్యంతో వనస్థలిపురం ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్. శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అరైవ్ అండ్ అలైవ్ ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని జాతీయ రహదారి 65పై కొత్తగూడెం క్రాస్ రోడ్ యూటర్న్ వద్ద నిర్వహించారు.అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని శ్రీ హర్ష మెస్ అండ్ రెస్టారెంట్ సమీపంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ట్రాఫిక్2 ఎల్‌బీనగర్ డీసీపీ వి. శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై రహదారి భద్రతపై ప్రజలకు విలువైన సూచనలు చేశారు. అదనపు డీసీపీ జి. శ్రీనివాస్ కుమార్, ట్రాఫిక్ ఎల్‌బీనగర్ డివిజన్ ఏసీపీ బి. నవీన్ రెడ్డి కూడా పాల్గొని ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. అధిక వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలే ఎక్కువ ప్రమాదాలకు కారణమవుతున్నాయని పేర్కొన్నారు. వాహనదారులు హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగంతో పాటు రహదారి సూచికలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సుమారు 100 మందికి పైగా ప్రజలు హాజరై రోడ్డు భద్రతపై అవగాహన పొందారు. వాహనదారుల బాధ్యతాయుతమైన ప్రవర్తనతోనే ప్రమాదాలను అరికట్టవచ్చని, "అరైవ్ అండ్ అలైవ్" సందేశాన్ని ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని వనస్థలిపురం ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్. శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. "రోడ్డు నిబంధనలు పాటిద్దాం... సురక్షితంగా ఇంటికి చేరుదాం" అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజల్లో విశేష స్పందనను పొందింది. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి జాతీయ రహదారి 65 విభాగం ఏఈఈ, ఎన్‌హెచ్ 65 రోడ్డు కాంట్రాక్టర్ ప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం

- **ఎమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొని ప్రజలకు మార్గదర్శనం**



**చేవెళ్ల, విశాలభారతి:** మున్సిపాలిటీలో ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం సందర్భంగా 12 నుండి 18వ వార్డుల్లో వార్డు సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య హాజరై ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా వర్షాకాల సన్నద్ధత, సురక్షిత తాగునీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ, మొక్కల పెంపకం ద్వారా వన మహోత్సవం విజయవంతం చేయడం, ప్రజల భద్రత వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మరియు ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని అభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ కాసుల రాము గౌడ్, కౌన్సిలర్ బండారి శైలజ ఆగిరెడ్డి, పిఏసిఎస్, చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాపరెడ్డి, మున్సిపల్ కమిషనర్ యాదగిరి, కౌన్సిలర్లు మధ్యల శ్రీనివాస్, మంగలి కళ్యాణి యాదగిరి, అత్తెల్లి మనిషా అనంతరెడ్డి, కృష్ణా నాయక్, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు పడాల ప్రభాకర్, రెడ్డి శెట్టి మధుసూదన్ గుప్తా, మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, నాయకులు అత్తెల్లి రవీందర్ రెడ్డి, మల్లారి శ్రీకాంత్ రెడ్డి, కవాడి రాజవర్ధన్ రెడ్డి, పిసరి దామోదర్ రెడ్డి, వార్డు ప్రజలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పిగ్లిపూర్ గ్రామాభివృద్ధికి ప్రత్యేక గ్రామసభ దిశానిర్దేశం

- **పారిశుద్ధ్యం నుంచి వరద భద్రత వరకు కీలక అంశాలపై చర్చ – ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధికి సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి పిలుపు**




**విశాల భారతి , అబ్దుల్లాపూర్‌మెట్ :** అబ్దుల్లాపూర్మెట్ మండలం పిగ్లిపూర్ గ్రామాన్ని పరిశుభ్రమైన, హరితమైన, సురక్షితమైన గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా తడి చెత్త - పొడి చెత్త వేరు చేసి నిర్వహించే విధానం, వర్షాకాల సన్నద్ధత, సురక్షిత త్రాగునీటి సరఫరా, జల సంరక్షణ - మన సంరక్షణ కార్యక్రమం, మొక్కల పెంపకం ద్వారా వనమహోత్సవం విజయవంతం చేయడం, ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ, వరద నిర్వహణ భద్రత వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామసభలో డిప్యూటీ తహసీల్దార్ వేణు, గ్రామ పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న, డాక్టర్ శ్రేయ, ఎస్సై బద్యా నాయక్, జీపీఓ కవిత, బీఎల్‌వో కవిత పాల్గొని ప్రజలకు సూచనలు చేశారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. గ్రామ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ప్రజా ఆరోగ్యం కోసం గ్రామసభలో తీసుకున్న నిర్ణయాలను అందరూ కలిసి అమలు చేయాలని సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజల సహకారంతో పిగ్లిపూర్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దుర్గం నరసింహ, వార్డు సభ్యులు జక్కుల శివకుమార్, జక్కుల ఝాన్సీ ఆంజనేయులు, వర్ధం లావణ్య హనుమంతు, జక్కుల పరమేష్, పంది మురళీకృష్ణ, కొండ రమేష్, కోలన్ హరిని మహేందర్, వీఓఏ రేణుక, ఆశా వర్కర్ కవిత, విద్యుత్ శాఖ సిబ్బంది రాజు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

- **సర్పంచ్ చింతకింది ప్రవీణ్ రెడ్డి.. ఎత్బార్‌పల్లిలో గ్రామ సభ నిర్వహణ**
- **సొంత నిధులతో చెత్త డబ్బాలు, సీసీ కెమెరాల ఏర్పాటు**

**మొయినాబాద్, విశాలభారతి:** ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని ఎత్బార్‌పల్లి గ్రామ సర్పంచ్ చింతకింది ప్రవీణ్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎత్బార్‌పల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు.గ్రామ సభలో తడి, పొడి, ప్రమాదకర చెత్త సేకరణపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు గ్రామంలోని సుమారు 200 ఇళ్లకు సర్పంచ్ తన సొంత నిధులతో ప్రతి ఇంటికి నాలుగు డబ్బాల చొప్పున పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఇంటి వ్యర్థాలను నాలుగు రకాలుగా వేరు చేసి గ్రామ పంచాయతీ చెత్త బండిలో వేయాలని కోరారు. చెత్తను ఇళ్ల ముందు, సందుల్లో వేయడం వల్ల దోమలు, ఈగలు పెరిగి వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హిమబిందు, ఉపసర్పంచ్ మహేష్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.సొంత నిధులతో సీసీ కెమెరాల ఏర్పాటు గ్రామంలో శాంతిభద్రతలు, నేర నియంత్రణ కోసం సర్పంచ్ చింతకింది ప్రవీణ్ రెడ్డి రూ.4.50 లక్షల సొంత నిధులతో 32 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సీసీ కెమెరాలను మొయినాబాద్ సీఐ వై. మల్లికార్జున రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అరికట్టవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన సర్పంచ్ ప్రవీణ్ రెడ్డిని అభినందించారు.



## భరోసా కేంద్రాలతో బాధితులకు అండ



**బాధితుల సంరక్షణపై డీసీపీ సృజన కీలక సూచనలు**

**సైబరాబాద్ - విశాల భారతి**

అత్యాచారం, చిన్నారులపై లైంగిక వేధింపుల వంటి తీవ్ర నేరాల బాధితులకు ఒకేచోట అన్ని సేవలు అందించే భరోసా, సీడీఈడబ్ల్యూ కేంద్రాల పనితీరును మరింత బలోపేతం చేసేందుకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించినట్లు సైబరాబాద్ ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కర్ణం వెల్లడించారు. సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం.రమేష్ ఆదేశాల మేరకు సీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలను డీసీపీ సృజన వెల్లడించారు. తీవ్ర నేరాల బాధితులకు వెంటనే భరోసా కల్పించడం, వారి హక్కులను పరిరక్షించడం, న్యాయ ప్రక్రియలో మరింత మానసిక క్షోభకు గురికాకుండా జీవితాన్ని తిరిగి నిర్మించుకునేందుకు సమగ్ర సహాయం అవసరమని సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. ఈ అవసరాన్ని గుర్తించే తెలంగాణ పోలీసులు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారని, ఈ కేంద్రాల్లో న్యాయ సహాయం, వైద్య సేవలు, మానసిక సలహా, పునరావాసం వంటి అన్ని సేవలు ఒకే కప్పు కింద అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఎఫ్ఐఆర్ నమోదు నుంచి తీర్పు వచ్చే వరకు బాధితులు న్యాయ ప్రక్రియలో మళ్లీ బాధితులు కాకుండా నిరంతర సహాయం అందిస్తామని స్పష్టం చేశారు. బాధితుల సంరక్షణ, సహాయ యంత్రాంగాన్ని మరింత పటిష్ఠం చేసేందుకు సమావేశంలో పలు సిఫార్సులు చేసినట్లు డీసీపీ సృజన పేర్కొన్నారు. ఆలస్య రాత్రి వేళల్లో బాధితులను పోలీస్ స్టేషన్లలో ఉంచకుండా అవసరమైన చోట షెల్టర్ హోమ్స్‌లో సురక్షితంగా ఉంచాలని, బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 183 కింద వాంగ్మూలం నమోదు చేసే ముందు బాధితుల వాంగ్మూలాలను సమగ్రంగా రికార్డు చేయాలని, భరోసా కేంద్రాలకు వైద్యాధికారులను కేటాయించి వాస్తవాలు, బాధితుల అవసరాలను సరిగ్గా నమోదు చేయాలని సిఫార్సు చేసినట్లు వివరించారు. మార్చి 2022 నుంచి మే 2026 వరకు భరోసా కేంద్రాలు 472 పోక్సో కేసులు, 314 అత్యాచార కేసులను పరిష్కరించాయని, బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 180 కింద 908 వాంగ్మూలాలు నమోదు చేయడంలో సహాయం చేశాయని డీసీపీ తెలిపారు. బాధితులకు ఆర్థిక సహాయంగా జిల్లా బాధితుల పునరావాస నిధి ద్వారా 284 మంది లబ్ధిదారులకు విద్య, వైద్య అవసరాలు, జీవనోపాధి కోసం 70.35 లక్షల రూపాయల పరిహారం పంపిణీ చేసినట్లు వెల్లడించారు.ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా డీఎల్ఎస్ఏ కార్యదర్శి డాక్టర్ అనుష, రంగారెడ్డి జిల్లా సీడబ్ల్యూసీ చైర్మన్ డాక్టర్ కె. నరేందర్ రెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన రాజా రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రంగా బి. భిక్షపతి, విద్యా శాఖ ప్రభాకర్ రెడ్డి, సీఎంవో బి. వెంకటేష్, డీసీపీవో ఇంతియాజ్ రహీం, డాక్టర్ ఉమా దీపిక, డాక్టర్ లావణ్యతో పాటు సైబరాబాద్‌కు చెందిన పలువురు సీనియర్ పోలీసు అధికారులు పాల్గొన్నట్లు డీసీపీ సృజన తెలిపారు.

## ప్రధాని మోదీ 12 ఏళ్ల సుదీర్ఘ సేవా యాత్రకు అభినందనలు



- **ప్రధాని మోదీ 12 ఏళ్ల సుదీర్ఘ సేవా యాత్రకు అభినందనలు**
- **బౌద్ధనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు సాయి ప్రసాద్ గౌడ్**

**సికింద్రాబాద్, విశాలభారతి :**

భారత ప్రధానమంత్రిగా 12 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణాన్ని పూర్తి చేసి, 4,399 రోజుల పాటు అంకిత భావంతో దేశసేవ చేస్తూ, స్వతంత్ర భారతదేశంలో అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానమంత్రిగా నిలిచి చరిత్రలో తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకున్న నరేంద్ర మోదీ కి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ బౌద్ధనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాయి ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో బౌద్ధనగర్ కనకదుర్గ దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. "ప్రధాని మోదీ దేశ భద్రత, సుశాసనం, పేదల సంక్షేమం కోసం చేస్తున్న సేవ నిరుపమానం. వికసిత భారత నిర్మాణంలో ఆయన నాయకత్వం నిరంతరం కొనసాగాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించాం" అని సాయి ప్రసాద్ గౌడ్ తెలిపారు. పూజా కార్యక్రమంలో నాయకులు కొంజర్ల శ్రీనివాస్, నాగరాజు,సుధాకర్, అశోక్, వెంకటేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## సబ్‌ఇన్‌స్పెక్టర్లకు వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక సదస్సు

**జీవిత సవాళ్లను అవకాశాలుగా మలుచుకోవాలని సీపీ సూచన**



**సైబరాబాద్ విశాల భారతి:** సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని సబ్‌ఇన్‌స్పెక్టర్ల కోసం వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం సీపీ కార్యాలయ ఆడిటోరియంలో ఈ ఇంటరాక్టివ్ సెషన్ జరిగింది.కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ శ్రీ సుధీర్ సాండ్ర పాల్గొని సబ్‌ఇన్‌స్పెక్టర్లకు వ్యక్తిత్వ వికాసం, ఒత్తిడి నిర్వహణ, భావోద్వేగ నియంత్రణ, నాయకత్వ లక్షణాల పెంపు, వృత్తిపరమైన నైపుణ్యాల అభివృద్ధి వంటి అంశాలపై అవగాహన కల్పించారు. పోలీసు విధుల్లో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ మానసిక దృఢత్వంతో విధులు నిర్వహించాల్సిన అవసరాన్ని వివరించారు.ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్, హెల్త్ మేనేజ్‌మెంట్‌తో పాటు కుటుంబ జీవితం, ఉద్యోగ బాధ్యతల మధ్య సమతుల్యతను పాటించడం ప్రతి అధికారికి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. మంచి ఆలోచనలు, ఉన్నత ఆశయాలు, స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగితే జీవితంలో విజయాలను సాధించడం సులభమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమను తాము ప్రతిరోజూ విశ్లేషించుకుంటూ, భవిష్యత్ లక్ష్యాల దిశగా కృషి చేయాలని సూచించారు. పోలీసు శాఖ ఒక విశ్వసనీయ బ్రాండ్ అని, దానికి తగిన నైతిక విలువలు, క్రమశిక్షణ, ప్రజా సేవా దృక్పథాన్ని ప్రతి అధికారి కాపాడాలని సీపీ సూచించారు. దర్యాప్తు నిర్వహణలో వృత్తిపరమైన నైపుణ్యాలు, విశ్లేషణాత్మక ఆలోచన, ప్రజలతో సమన్వయం, చట్టబద్ధతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. కేసుల దర్యాప్తులో నిజాయితీ, నిబద్ధత, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు.జీవితంలో ఎదురయ్యే అవాంతరాలు, ఒత్తిళ్లు, సవాళ్లను అవకాశాలుగా మలుచుకోవాలని, అపజయాలను పాఠాలుగా స్వీకరించి ముందుకు సాగాలని సీపీ సూచించారు. నేటి బిజీ జీవితంలో నైతిక విలువలపై దృష్టి తగ్గుతోందని, వాటిని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. "అపకారికి ఉపకారం" అనే విలువను ఆచరిస్తూ సమాజంలో ఆదర్శప్రాయమైన పోలీసు అధికారులుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఎవరూ పరిపూర్ణులు కాదని, నిరంతర అభ్యాసం, ఆత్మవిశ్వాసం, సానుకూల దృక్పథంతోనే ఉన్నత విజయాలు సాధించగలమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డితో పాటు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## తడి పొడి చెత్తను వేరు చేయాలి

**వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ పెద్దవేటి అర్చన అజయ్ రెడ్డి**



**మొయినాబాద్ విశాలభారతి:** తడి, పొడి చెత్తను వేరు చేయాలని, వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ పెద్దవేటి అర్చన అజయ్ రెడ్డి అన్నారు. బుధవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా మొయినాబాద్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ పెద్దవేటి అర్చన అజయ్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల వ్యవసాయ అధికారిణి అనురాధ, ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వడం వలన కలిగే లాభాలు, ఇవ్వకపోవడం వలన కలిగే అనార్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ సర్పంచ్ పెద్దవేటి అర్చన అజయ్ రెడ్డి మాట్లాడుతూ..ఇంటి పరిసరాల్లో చెత్తాచెదారం వేయరాదని, చెత్త నియంత్రణ నిర్మూలనతో మన ఆరోగ్యాలను మనమే కాపాడుకోవాలన్నారు. చెత్తను వేరు చేయడం వల్ల దోమలు, ఈగలు పెరగకుండా దుర్వాసన రాకుండా వ్యాధులు అదుపులో ఉంటాయని తెలిపారు. ప్రతి ఒక్కరు ఇంటి నుంచి వచ్చే చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి పంచాయితీ చెత్త సేకరణ ట్రాక్టర్లలో వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రభాకర్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేష్, విద్యుత్ అధికారి ప్రభాకర్, ఏపీఎం మల్లేష్, ఏఎన్ఎం సిస్టర్ మన పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, అంగన్వాడి టీచర్ లక్ష్మి, మిషన్ భగీరథ సిబ్బంది యాదయ్య, నరేష్, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



# రూ. 13,000 కోట్ల హ్యామ్ పనులకు సీఎం శంకుస్థాపన

**విశాలభారతి:**

తెలంగాణ రాష్ట్ర రహదారుల వ్యవస్థను జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు ప్రజా ప్రభుత్వం చారిత్రక అడుగులు వేస్తోంది. అందులో భాగంగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పద్ధతిలో 13,000 కోట్ల రూపాయల భారీ వ్యయంతో 6,300 కిలోమీటర్ల మేర రహదారులను డబుల్ రోడ్లుగా విస్తరించే పనులకు ఈ నెల 17న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. నల్గొండ జిల్లా కనగల్ వేదికగా జరిగే ఈ భారీ బహిరంగ సభలో ప్రభుత్వం ఈ మేగా ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించనుంది. గత ఏడాది కాలంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పర్యవేక్షణలో 34 ప్యాకేజీల వారీగా పూర్తి చేసిన టెండర్ల ప్రక్రియ ద్వారా ఈ పనులకు ఇప్పటికే వర్క్ ఆర్డర్లు జారీ చేశారు. దీనికి తోడు పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో మరో 7,000 కోట్ల రూపాయల నిధులతో చేపట్టే పనులను కలుపుకుని రాష్ట్రవ్యాప్తంగా మౌలిక వసతుల కల్పనకు ఊతం లభించనుంది. నల్గొండ జిల్లాలో రెండు కీలక ప్యాకేజీల ద్వారా రహదారుల రూపురేఖలు మారనున్నాయి. ధర్వేశిపురం



నుంచి గుర్రంపోడు, మల్లెపల్లి, దేవరకొండ మీదుగా దిండి వరకు 300 కోట్ల రూపాయల వ్యయంతో డివైడర్‌తో కూడిన డబుల్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. ప్రమాదాలు అధికంగా సంభవిస్తున్న ఈ మార్గంలో ప్రయాణికుల భద్రతను మెరుగుపరచడం ప్రధాన ఉద్దేశ్యం. మరో ప్యాకేజీ కింద చిట్యాల నుంచి రామన్నపేట, వలిగొండ, భువనగిరి మీదుగా జగదేవ్‌పూర్ వరకు 300 కోట్ల రూపాయల వ్యయంతో పాటు ఆలేరు నియోజకవర్గంలో మరో 300 కోట్ల రూపాయలతో రహదారుల అభివృద్ధి చేపట్టనున్నారు. ఈ రహదారుల నిర్మాణం వల్ల పారిశ్రామికాభివృద్ధి వేగవంతం అవ్వడమే కాకుండా గ్రామీణ ప్రాంతాలకు పెట్టుబడులు తరలివచ్చే అవకాశం మెరుగుపడుతుంది. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ధర్వేశిపురం ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నల్గొండలో నిర్వహించే భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొంటారు. గత రెండున్నరేళ్ల కాలంలో తెలంగాణలో జరగని విధంగా అత్యంత పెద్ద సభగా దీనిని తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ సభ ఏర్పాట్లపై 13వ తేదీన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. అదే రోజు నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు నిరంతరం కృష్ణా జలాల సరఫరా చేసే లక్ష్యంతో 125 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేయనున్న కొత్త వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు కూడా ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో పునాది వేయనున్నారు. ఈ అభివృద్ధి పనులన్నింటితో జిల్లాను తెలంగాణలో ఆదర్శ జిల్లాగా నిలబెట్టాలనే లక్ష్యంతో అధికార యంత్రాంగం వేగంగా కదులుతోంది. రాష్ట్రవ్యాప్తంగా రవాణా వ్యవస్థను నంబర్ వన్ స్థానంలో ఉంచడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ 13,000 కోట్ల రూపాయల రహదారి ప్రాజెక్టు అమలు వల్ల ప్రమాదాలు గణనీయంగా తగ్గడమే కాకుండా గ్రామీణ ప్రాంతాల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయి. రహదారుల విస్తరణతో పాటు రవాణా సమయం ఆదా అవుతుంది, ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బలాన్ని ఇస్తుంది. 2016లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హ్యామ్ నమూనాను ఇక్కడ ఆదర్శంగా తీసుకుని నాణ్యమైన పనులను త్వరితగతిన పూర్తి చేసేలా కఠినమైన గడువులను విధించారు. నల్గొండ జిల్లాను అన్ని రంగాలలో ప్రగతి పథంలో నడిపించేందుకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించడమే తమ ప్రధాన బాధ్యతగా ప్రభుత్వం భావిస్తోంది.

## ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి సాధ్యం

**బోధన్‌లో ఘనంగా 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' వార్డు సభ**



**విశాలభారతి, బోధన్ :** బోధన్ పట్టణంలోని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కళ్యాణ మండపంలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా 31వ వార్డు నుంచి 38వ వార్డుల వరకు సంయుక్త వార్డు సభ బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారం, పారిశుధ్యం, ఆరోగ్యం, ఓటర్ల జాబితా సవరణ, సైబర్ నేరాల నివారణ తదితర అంశాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ (ఏసీ ఎల్‌బీ) భుజంగరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మ, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, బోధన్ టౌన్ ఎస్ఐ హబీబ్ ఖాన్, మున్సిపల్ మేనేజర్ రమేష్, మండల ఆర్ఐ శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు, మెప్మా పట్టణ సమన్వయకర్త శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. అడిషనల్ కలెక్టర్ భుజంగరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు వార్డు సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఇంటి వద్దే తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే అందించాలని సూచించారు. డ్రైనేజీల్లో చెత్త వేయకుండా పరిశుభ్రత పాటించాలని, ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగాన్ని తగ్గించాలని కోరారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా డెంగీ, మలేరియా, కలరా వంటి వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై వివరిస్తూ, ప్రతి అర్హుడైన పౌరుడు తన పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. అలాగే జాతీయ కుటుంబ ప్రయోజన పథకం, బీమా పథకాలు వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టౌన్ ఎస్ఐ హబీబ్ ఖాన్ మాట్లాడుతూ యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పకూడదని హెచ్చరించారు. 'డిజిటల్ అరెస్ట్' పేరుతో వస్తున్న మోసపూరిత కాల్స్‌ను నమ్మవద్దని తెలిపారు. ప్రతి వార్డులో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా శాంతిభద్రతలు మెరుగుపడతాయని చెప్పారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మ మాట్లాడుతూ వార్డు సభల్లో వచ్చిన సమస్యల పరిష్కారానికి మున్సిపాలిటీ కట్టుబడి ఉందన్నారు. పట్టణంలో పారిశుధ్యం, డ్రైనేజీ శుభ్రత, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి సేవలను సమర్థవంతంగా అందిస్తున్నామని తెలిపారు. ప్రజల సహకారంతో బోధన్‌ను పరిశుభ్రమైన, చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, వార్డు అధికారులు, మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, మున్సిపల్ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వాటర్ లాగింగ్‌పై కమిషనర్ సృజన ఫీల్డ్ చెక్

**ఎన్నికల సంఘం ఆఫీసు, సంతోష్ ధాబా వద్ద తనిఖీలు.. తక్షణ చర్యలకు ఆదేశం**



**సైబరాబాద్ విశాల భారతి :** శేరిలింగంపల్లి జోన్‌లో వర్షాకాలం వాటర్ లాగింగ్ సమస్యపై అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. సృజన ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్, సూపరింటెండింగ్ ఇంజనీర్, డిప్యూటీ కమిషనర్లతో కలిసి సమస్యాత్మక ప్రాంతాలను బుధవారం పరిశీలించారు.

**క్షేత్రస్థాయి అంచనా,తక్షణ చర్యలు...**

బుధవారం జోన్ పరిధిలోని ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద, సంతోష్ ధాబా వద్ద నీటి నిల్వ ప్రాంతాలను అధికారులు స్వయంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో అంచనా నిర్వహించి డ్రైనేజీ పరిస్థితులను క్షుణ్ణంగా పర్యవేక్షించారు. వర్షపు నీరు సజావుగా ప్రవహించేలా, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు కమిషనర్ సృజన తక్షణ చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. అడ్డంకులు వెంటనే తొలగించి, డ్రైనేజీ లైన్లను శుభ్రం చేయాలని, ప్రత్యేక బృందాలతో నిరంతర మానిటరింగ్ చేయాలని సూచించారు.వర్షాకాలం ముగిసే వరకు ఫీల్డ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా నీరు నిలిచిన వెంటనే స్పందించాలని కమిషనర్ జి.సృజన ఆదేశించారు.

## మోడీజీ సంపూర్ణ ఆరోగ్యాంగా ఉండాలి

**విశాల భారతి, ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గల శ్రీ నాగలింగేశ్వర ఆలయంలో బుధవారం రోజు నేటి రోజుతో నరేంద్ర మోడీజీ భారత ప్రధానిగా అత్యధిక రోజులు భారత ప్రధానిగా పరి పాలించిన శుభ సందర్భంగా బీజేపీ జిల్లా నాయకులు కలిగొట గంగాధర్, ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మోడీజీ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని, భారత ప్రజలకు మరింత సేవాలు చేసే విధంగా మోడీజీ కి శక్తి నివ్వాలని శ్రీ నాగ లింగేశ్వర స్వామిని కోరడం జరిగిందన్నారు. ఆయన మాట్లాడుతూ మోడీజీ భారత ప్రధానిగా నేటి రోజుతో 4399 రోజులు పూర్తి చేసుకున్నారన్నారు. అత్యధిక రోజులు భారత ప్రధానిగా సేవాలు అందించే అవకాశం ప్రజల ఆశీర్వాదంతో ఘనత సాధించారన్నారు. భారత ప్రధానిగా గతంలో పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, 4398 రోజులతో అత్యధిక రోజులు ప్రధాన మంత్రిగా ఉన్నారని, నేటితో మోడీజీ 4399 రోజులు ప్రధానిగా పూర్తి చేసుకొని అత్యధిక రోజులు భారత ప్రధానిగా సేవలన్దిచే భాగ్యం ప్రజల ఆశీర్వాదంతో ముందుకు వెళ్తున్నారని అన్నారు. ఎలాంటి సెలవులు తీసుకోకుండా నిరంతరం భారత ప్రజలకు సేవలు అందిస్తున్నారని, అభివృద్ధి, అన్ని వర్గాల ప్రజా సంక్షేమం, దేశ భద్రత, అవినీతి రహిత పాలన, వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారని అన్నారు. బీజేపీ, ఎన్డీఏ పక్షలను ఆశీర్వాదిస్తున్న ప్రజలకు నా ప్రత్యేక ధన్యవాదములు అని అన్నారు. మోడీజీ సంపూర్ణ ఆరోగ్యాంగా ఉండాలని పూజలో పాల్గొన్న ఆలయ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. పూజ అనంతరం నాయకులు మోడీజీ నాయకత్వం వర్ధిల్లాలి అని, లాంగ్ లివ్ మోడీజీ అని నినాదాలు చేశారు. ఈ పూజ కార్యక్రమంలో గజవాడ రాజయ్య, నారాయణ, శ్యామ్ సుందర్, అజయ్, అజంతా శ్రీనివాస్, రూపేష్, రమేష్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరిలో భక్తి భావం పెంపొందాలి



**విశాల భారతి,ఆర్మూర్:** ప్రతి ఒక్కరిలో భక్తి భావన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నగేష్ శర్మ గురుస్వామి అన్నారు. బుధవారం రోజు ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని జంబి హనుమాన్ ఆలయంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన 2వ బుధవారం మాస పూజా కార్యక్రమానికి ఆయన హాజరై అయ్యప్ప ఆలయంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న ప్రసాదం వితరణ కార్యక్రమానికి ఆర్మూర్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గురుస్వామి నగేష్ శర్మ మాట్లాడుతూ, ప్రతినెల 2వ బుధవారం అన్న ప్రసాదం కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమని, ప్రతి ఒక్కరిలో భక్తి భావన పెరగాలని ఆయన అన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ఆయన కోరారు. అన్న ప్రసాదం కార్యక్రమానికి పూర్తి ఖర్చులు భరించిన ఆశన్న గారి రాజేశ్వర్ రెడ్డి, కుటుంబ సభ్యులకు అయ్యప్ప కరుణ కటాక్షాలు ఉండాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి అధ్యక్ష కార్యదర్శులు పుట్టి మురళి, మీసాల రవి, కోశాధికారి గాజారెడ్డి నర్సారెడ్డి, సహాయ కోశాధికారి షేర్ ఒడ్డెన్న, పెంట జలంధర్, జనార్ధన్ గౌడ్, పోల సుధాకర్, మసాల సత్యనారాయణ, బాలాజీ గంగామోహన్, జంబి హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ రేగుళ్ల సత్యనారాయణ, డైరెక్టర్ నూతుల నారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ కాటిపల్లి వెంకటరెడ్డి, కౌన్సిలర్లు సడక్ వినోద్, నర్మే నవీన్, భూపేందర్, గంగూలీ, నరేష్, వరుణ్, అయ్యప్ప స్వాములు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆలయంలో బిజెపి నాయకుల ప్రత్యేక పూజలు

**సికింద్రాబాద్, విశాలభారతి :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజయవంతంగా 12 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ నాయకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారతదేశాన్ని 'విశ్వగురువు' దిశగా నడిపిస్తున్న ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలని కోరుకుంటూ కంటెస్టెడ్ కార్పొరేటర్ మేకల కీర్తిహర్షకిరణ్ ఆధ్వర్యంలో మధురానగర్ కాలనీలోని బంగారు మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల సారంగపాణి తో పాటు ముఖ్య నాయకులు రాజు సాగర్, వనమాల శ్రీనివాస్, శ్యామ్ రాజ్ , సతీష్ నేత, భిక్షపతి, బాలయ్య, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.



# శేరిలింగంపల్లిలో రాజకీయ రచ్చ

- నాయకుల మాటల యుద్ధం - ప్రజల సమస్యలు గాల్లో
- ఎమ్మెల్యే వర్సెస్ కార్పొరేటర్, కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్
- బీజేపీ క్యాడర్ జోష్, నాయకులు బేహోష్

**సైబరాబాద్ - విశాల భారతి**

దేశానికే ఆదర్శంగా నిలవాల్సిన శేరిలింగంపల్లి ఐటీ కారిడార్‌లో ప్రస్తుతం రాజకీయం పూర్తిగా దారి తప్పింది. అభివృద్ధి, ప్రజా సమస్యలు మరిచి ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఒకరిపై ఒకరు మాటల దాడులకు దిగుతున్నారు. ఫలితంగా వాటర్ లాగింగ్, డ్రైనేజీ, అక్రమ నిర్మాణాల వంటి స్థానిక సమస్యలు పరిష్కారం కాకుండా ప్రజల ఆగ్రహానికి కారణమవుతున్నాయి. 'నాయకుల ముష్టి యుద్ధాల వల్ల మాకు ఒరిగేదేమీ లేదు' అని ప్రజలు బహిరంగంగా వాపోతున్నారు.

**సీఎం సభ వేదికగా రాజకీయ చిచ్చు**

ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, చందానగర్ మాజీ కార్పొరేటర్ బొబ్బా నవతారెడ్డిపై పరోక్షంగా విరుచుకుపడ్డారు. 'ఇంటింటికి తిరుగుతూ వాచీలు ఇస్తూ, కండువాలు కప్పుతూ మీటింగ్‌కు వెళ్లకూడదు' అన్న వ్యాఖ్యలు నేరుగా నవతారెడ్డిని ఉద్దేశించినవేనని స్పష్టమైంది. దీనిపై బొబ్బా నవతా రెడ్డి అంతే ఘాటుగా ఎదురుదాడి చేశారు. 'అసలు మీ అధినేత ఎవరు? కనీసం ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని దౌర్భాగ్య పరిస్థితిలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ ఉన్నారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీలో కొనసాగుతూ ఇతరులపై విమర్శలు చేయడం అవాస్తవం. సొంత పార్టీ ఎజెండా ఏంటి,



ఇటీవల జరిగిన సీఎం బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ (ఫైల్ )

అధినాయకత్వం ఎవరు, ఏ పార్టీలో డెవలప్‌మెంట్ జరిగిందో చెప్పకుండా వింత వాదనలతో, వితండ వాదంతో కాలం వెళ్లదీస్తున్నారు' అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.'ఓ పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీలో కొనసాగుతూ విమర్శలు చేయడం ప్రజలు సహించరు. శేరిలింగంపల్లి ప్రజలు తీవ్ర అసహనంతో ఉన్నారు' అని ఆమె పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలతో ఎమ్మెల్యే వర్సెస్ మాజీ కార్పొరేటర్ మధ్య మాటల యుద్ధం కొత్త మలుపు తిరిగింది.

**సోషల్ మీడియాలో కాంగ్రెస్-బీఆర్ఎస్ రచ్చ రచ్చ**

ఎమ్మెల్యేమాజీ కార్పొరేటర్ మధ్య మొదలైన ఈ విమర్శలు ఇప్పుడు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య హోరాహోరీగా మారాయి. సోషల్ మీడియా వేదికగా ఫేస్‌బుక్, వాట్సాప్ గ్రూపులు, ఎక్స్‌లో రెండు పార్టీల కార్యకర్తలు 'నువ్వా నేనా' అన్నట్లుగా తలపడుతున్నారు. నాయకుల రెచ్చగొట్టే ప్రసంగాలతో 'డి అంటే డి' అనే స్థాయికి పరిస్థితి చేరుకుంది. ఒకప్పుడు కలిసి పనిచేసిన కార్యకర్తలు ఇప్పుడు ఒకరిపై ఒకరు బురద జల్లుకుంటున్నారు. ప్రజా సమస్యలపై పోరాడాల్సిన కార్యకర్తలు నాయకుల వ్యక్తిగత దాడుల్లో ఇరుక్కుపోయి అయోమయంలో పడుతున్నారు. పార్టీలకు అతీతంగా స్థానిక సమస్యలపై పనిచేయాల్సిన నాయకులు విమర్శలకే పరిమితమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**క్యాడర్ జోష్ , లీడర్స్ బేహోష్ - బీజేపీ పరిస్థితి**

మరోవైపు బీజేపీ తీరుపై ఆ పార్టీ కింది స్థాయి కార్యకర్తలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలకు స్థానిక బీజేపీ నాయకత్వం అంతే స్థాయిలో బదులివ్వలేదు. ఒకరిద్దరు మినహా పెద్ద నాయకులు ఎవరూ ప్రెస్‌మీట్ పెట్టి వివరణ ఇవ్వలేదు, ధీటుగా జవాబు ఇవ్వలేని పరిస్థితి కనిపిస్తోంది. 'శేరిలింగంపల్లిలో బీజేపీకి క్యాడర్ ఉంది, నాయకత్వం ఉంది. కానీ పార్టీ అధినాయకత్వాన్ని విమర్శిస్తున్న వారిపై అంతే స్థాయిలో ప్రతి విమర్శ చేయలేని స్థితిలో పడిపోయాం. బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు ఎక్కువ పెట్టిన ప్రతిసారి ఎదురుదాడి అంతే స్థాయిలో తిప్పికొడుతుంది. కానీ మా పార్టీలో క్యాడర్, క్రెడిట్ ఉన్నా 'ఎవరికి వారే యమునా తీరు'గా వ్యవహరిస్తున్నారు. పైస్థాయి నాయకత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు, ప్రతిదాడి లేకపోవడంతో కింది స్థాయి కార్యకర్తగా మేము తలదించుకునే పరిస్థితి వస్తోంది' అని స్థానిక బీజేపీ క్యాడర్ ఆవేదన వ్యక్తం చేస్తోంది. పార్టీ పట్ల నమ్మకంతో పనిచేస్తున్నా, నాయకత్వం నుంచి సమన్వయం, దూకుడు లేకపోవడంతో కార్యకర్తలు పెదవి విరుస్తున్నారు.

**'ప్రభుత్వాలు మారినా పరిస్థితుల్లో మార్పు లేదు'**

'నాయకుల ఈ ముష్టి యుద్ధాల వల్ల మాకు ఒరిగేదేమీ లేదు. ఎవరు వచ్చినా మా పరిస్థితులు ఎక్కడ వేసిన గొంగడి అలాగే ఉన్నాయి' అని శేరిలింగంపల్లి ప్రజలు బహిరంగంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'మాకు వాచీలు, కండువాలు, సోషల్ మీడియా రచ్చలు వద్దు. వాటర్ లాగింగ్ లేని రోడ్లు, సరిగ్గా వెళ్లే డ్రైనేజీ, అన్ని రకాల మౌలిక వసతుల కాలనీలు కావాలి' అని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం**

శేరిలింగంపల్లిలో నెలకొన్న రాజకీయ నిస్తేజంపై రాజకీయ విశ్లేషకులు స్పందిస్తూ, 'ఇక్కడ నాయకుల మధ్య వ్యక్తిగత వైరం ప్రజా సమస్యలను కప్పేస్తోంది. కాంగ్రెస్‌బీఆర్ఎస్ మధ్య ఆధిపత్య పోరు, బీజేపీలో సమన్వయ లోపం వల్ల ప్రతిపక్ష పాత్ర బలహీనపడింది. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి, పార్టీలకు అతీతంగా అందరూ కలిసికూర్చుని శాశ్వత పరిష్కారాలు చూపాల్సిన అవసరం ఉంది' అని అభిప్రాయ పడ్డారు.విశ్లేషకుల ప్రకారం, 'ఐటీ కారిడార్'గా పేరున్న శేరిలింగంపల్లిలో రాజకీయ నాయకులు తమ ప్రాధాన్యతలను మార్చుకోకపోతే, వచ్చే ఎన్నికల్లో ప్రజల తీర్పు తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. ప్రజలు ఓట్లు వేసింది మాటల యుద్ధానికి కాదు, సమస్యల పరిష్కారానికి అన్న విషయాన్ని నాయకులు గుర్తుంచుకోవాలి.



గాంధీ మాట్లాడిన మాటలను ట్యాబ్ లో చూపిస్తూ ప్రెస్ మీట్‌లో మాట్లాడుతున్న నవత రెడ్డి, బిఆర్ఎస్ నేతలు



# బాక్సాఫీస్ వద్ద రామ్ చరణ్ జోరు

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన స్పోర్ట్స్ డ్రామా పెద్ది బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం తొలి వారంలోనే భారీ వసూళ్లతో ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది.గ్రామీణ క్రీడల నేపథ్యంలో రూపొందిన ఈ పీరియాడిక్ స్పోర్ట్స్ ఎంటర్‌టైనర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. కొన్ని వర్గాల నుంచి మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, ఆ ప్రభావం కలెక్షన్లపై మాత్రం కనిపించడం లేదు. సినిమా విడుదలైనప్పటి నుంచి అన్ని ప్రాంతాల్లోనూ మంచి ఆక్యుపెన్సీ నమోదు చేస్తూ ముందుకు సాగుతోంది. తాజా సమాచారం ప్రకారం, 'పెద్ది' ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ.315 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఈ ఏడాది అత్యధిక వసూళ్లు సాధించిన తెలుగు చిత్రాల్లో ఒకటిగా నిలిచే దిశగా సినిమా అడుగులు వేస్తోంది. ఇక సినిమా క్రేజ్‌కు నిదర్శనంగా బుక్‌మైషోలో నమోదవుతున్న టికెట్ సేల్స్ నిలుస్తున్నాయి. గత 24 గంటల్లోనే 1.27 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. సాధారణంగా వర్కింగ్ డే అయిన బుధవారం రోజున కూడా ఈ స్థాయి బుకింగ్స్ నమోదు కావడం విశేషంగా మారింది. ఇది ప్రేక్షకుల్లో సినిమాపై ఉన్న ఆసక్తిని స్పష్టంగా తెలియజేస్తోంది.తెలుగు వార్తలు పాజిటివ్ మౌత్ పబ్లిసిటీ కూడా సినిమాకు ప్రధాన బలంగా మారింది. ఇప్పటికే సినిమా చూసిన ప్రేక్షకులు సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను పంచుకుంటుండటంతో మరింత మంది థియేటర్లకు వస్తున్నారు. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులు, యువత నుంచి మంచి స్పందన లభిస్తోందని ఎగ్జిబిటర్లు చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని అనేక ఏరియాల్లో సినిమా త్వరలోనే బ్రేక్ ఈవెన్ మార్క్‌ను చేరుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతేకాకుండా ఈ వారం పెద్ద సినిమాల విడుదలలు లేకపోవడం కూడా 'పెద్ది'కి అదనపు ప్రయోజనంగా మారింది. దీంతో రెండో వారంలోనూ బలమైన వసూళ్లు నమోదు చేసే అవకాశం ఉందని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.ఇక ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించగా, శివరాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. వృద్ధి సినిమాస్ నిర్మించిన ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందించారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.